నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది

అమ్మ బ్రహ్మనొకటి, నాన్న హరుడి సమము
గురువు యిలన జూడ హరియె గదర
మూడు మూర్తులుగను ముచ్చట ముగ్గురు
భవితదిద్ది మనదు బాగు కోరు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు, కవి



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 120 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 29-7-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


## పహల్గామ్ ఉగ్రవాదులు హతం

- కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్
- నలుగురిలో ముగ్గురిని మట్టుబెట్టినట్లు సమాచారం




**శ్రీనగర్, జూలై 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జమ్మూ కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరగింది. రెండు నెలల క్రితం పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడ్డ నలుగురిలో ముగ్గురిని భద్రతా బలగాలే ఎన్‌కౌంటర్ చేశాయి. అమాయకులైన 26 మంది టూరిస్టుల్ని పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ, లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన 'ది రెస్టిస్టెంట్ ఫ్రంట్(టీఆర్ఎఫ్)' ఉగ్రవాదులు చంపేశారు. ప్రకృతి అందాలను

-మిగతా 2 లో



## ఏ గుర్తింపు కార్డునైనా ఫోర్జరీ చేస్తారుగా..

- ఈసీకి సుప్రీంకోర్టు ప్రశ్న

**న్యూఢిల్లీ**

ఓటరు నమోదు కోసం ఆధార్, ఎలక్టర్స్ ఫొటో ఐడెంటిటీ కార్డ్ (ఈపీఐసీ)లను నిర్ణయాత్మక గుర్తింపు రుజువులుగా ఎన్నికల కమిషన్ అనుమతించకపోవడంపై సుప్రీంకోర్టు సోమవారం ప్రశ్నించింది. బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈసీని నిలదీసింది. ఆధార్‌ను ఎందుకు గుర్తింపు కార్డుగా పరిగణించడం లేదని, ఏ కార్డునైనా ఫోర్జరీ చేస్తారు కదా అని వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా ఈసీ న్యాయవాది మాట్లాడుతూ.. దేశ పౌరసత్వానికి ఆధార్ గుర్తింపు కాదన్నారు.రేషన్, ఆధార్ కార్డుల ఫోర్జరీ పెద్ద సమస్యగా మారిందన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం

-మిగతా 2 లో



## రాష్ట్రంలో మీనాక్షి పాదయాత్రలు

**కార్యకర్తలతో కలిస సమావేశాలు**
**జూలై 31 నుంచి ఆగస్టు 6 వరకు పర్యటనలు**

**హైదరాబాద్**

తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తన నియోజకవర్గ పర్యటనలో భాగంగా పాదయాత్రలను ప్రారంభించబోతున్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 6 వరకు వివిధ నియోజకవర్గాల్లో పాదయాత్రలు, శ్రమదానం కార్యక్రమాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నట్లు- పార్టీ వర్గాలు వెల్లడించాయి.పాదయాత్రల షెడ్యూల్ ప్రకారం, జూలై 31న పరిగి పట్టణంలో సాయంత్రం పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ పాదయాత్ర అనంతరం పరిగి లో రాత్రి బస చేయనున్నారు. ఆగస్టు 1న ఉదయం శ్రమదానం కార్యక్రమంలో పాల్గొని పార్టీ నాయకులు,

-మిగతా 2 లో




## చలో ఢిల్లీ

### బీసీ రిజర్వేషన్లపై హస్తినలోనే తేల్చుకుందాం

- రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయం
- 200 మంది ప్రజాప్రతినిధులతో రాష్ట్రపతి వద్దకు
- ఆగస్టు 5న పార్లమెంటులో వాయిదా తీర్మానం
- 6న జంతర్‌మంతర్ వద్ద ధర్నా
- అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల ఎత్తివేత
- మున్సిపల్ కార్పొరేషన్లలో మైక్రో బ్రూవరీస్ ఏర్పాటు
- జీవో 33పై ఏజీతో చర్చలు
- నాలుగున్నర గంటల పాటు భేటీ

**హైదరాబాద్ జూలై 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలోనే అమీతుమీ తేల్చుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. దీనికోసం 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి పిలుపునిచ్చింది. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఆగస్టు 5,6,7 తేదీల్లో ఢిల్లీలోనే మకాం వేసి, 42 శాతం బీసీ రిజర్వేషన్లను సాధించుకురావాలని నిర్ణయించారు. సోమవారంనాడిక్కడి డాక్టర్

-మిగతా 2 లో






## ప్రజాస్వామ్యంపై ఎస్ఐఆర్ దాడి

- పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన
- వాయిదాల పర్వంలో ఉభయ సభలు
- క్రైస్తవులపై హింసాత్మక ఘటనపై చర్చించాలి
- సీపీఐ(ఎం) ఎంపీ వి. శివదాసన్

**న్యూఢిల్లీ**

బీహార్‌లో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా ఐదో రోజూ ప్రతిపక్షాలు గళమెత్తాయి. ఇందులో భాగంగా సోమవారం పార్లమెంట్ సమావేశాల ప్రారంభం, వాయిదా తరువాత పెద్దఎత్తున ఇండియా బ్లాక్ ఎంపీలు నిరసనకు దిగారు. మకరద్వారానికి ఎదురుగా చేపట్టిన ఈ ఆందోళనలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్, సీపీఐ(ఎం) ఎంపీలు అమ్రారామ్, శివదాసన్, జాన్ బ్రిట్టాస్, టీఎంసీ ఎంపీలు డెరిక్ ఓ బ్రెయిన్, సాగరికా ఘోష్, డీఎంకే ఎంపీలు కనిమొళి, ఎ రాజాతో పాటు ఇండియా బ్లాక్ ఎంపీలు పాల్గొన్నారు. బీహార్ ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్(ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'సర్-ప్రజాస్వామ్యంపై దాడి' అనే భారీ బ్యానర్, ఎస్ఐఆర్‌ను ఆపాలి అనే ప్లకార్డులను ప్రదర్శించారు. కేంద్ర ప్రభుత్వ తీరుపై ప్రతిపక్ష ఎంపీలు నిరసించారు. ప్రజల అభిప్రాయం లేకుండా, ఎన్నికల తరువాత ఓటర్లను మత, కుల ప్రాతిపదికన వడపోసే ఈ ప్రయత్నాన్ని ప్రజా స్వామ్యాన్ని నాశనం

-మిగతా 2 లో



## తెలంగాణకు కొత్తగా నలుగురు జడ్జిలు

- వీరి నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ
- న్యాయ మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల

**హైదరాబాద్, జూలై 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**


తెలంగాణ హైకోర్టుకు మరో నలుగురు కొత్త జడ్జిలు రానున్నారు. దేశవ్యాప్తంగా పలు హైకోర్టులకు సోమవారం 19మంది జడ్జీలు, అదనపు జడ్జీలు నియమితులయ్యారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కోలీజియం సిఫారసులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. వీరి నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో న్యాయ మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల

-మిగతా 2 లో

## పాక్ దాడిని ప్రతిదాడితో ఘోరంగా దెబ్బతీసాం

### ఆపరేషన్ సిందూర్ భారత్ సత్తాకు నిదర్శనం

- మన సైనిక సత్తాను ప్రపంచమంతా గుర్తించింది
- ఉగ్రదాడికి ప్రతీకారంగానే ఉగ్రమూకలపై దాడి
- పాక్ దాడిని ప్రతిదాడితో ఘోరంగా దెబ్బతీసాం
- మన సైన్యం నిర్వహించిన పాత్ర అమోఘం
- లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చలో రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ, జూలై 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఆపరేషన్ సిందూర్ భారత్ సత్తాకు నిదర్శనమని, మన వీరజవాన్ల పాత్ర వెలకట్ట లేనిదని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి మన సత్తా చాటామని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో సోమవారంనాడు ప్రత్యేక చర్చను రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఆపరేషన్ సిందూర్ పేరుతో మిలటరీ యాక్షన్ చేపట్టింది. దీనిపై ప్రత్యేక చర్చలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొంటూ, కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ సిందూర్ పూర్తి చేశామని చెప్పారు. పహల్గాం దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని

-మిగతా 2 లో

## ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం

- పాలన గాలికి.. ప్రగతి కాటికి..



**హైదరాబాద్ -**

ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం అంటూ.. మేజర్ పంచాయతీల వరకే పరిమితమైన మద్యం దుకాణాలను పల్లెలకు విస్తరించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. గతంలో మద్యం అమ్మకాలపై విమర్శలు చేసిన హస్తం పార్టీ, అధికారం దక్కించుకున్న తర్వాత ఆదాయం

-మిగతా 2 లో

## మోడీ కాదు...రాహుల్ కన్వర్టెడ్

- కులగణన అంతా తప్పుల తడక
- రాబోయే ఎన్నికల్లో బిసిలకు పెద్దపీట వేస్తాం
- మీడియా సమావేశంలో బిజెపి అధ్యక్షుడు రామ్



**హైదరాబాద్,**

మోడీని న్వర్టెడ్ బీసీ అని సీఎం రేవంత్ విమర్శలు చేయడంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ కన్వర్ట్ అయ్యారు.. మోడీ కాదు అని ఆయన విమర్శించారు. కేసీఆర్ గతంలో ఎంబీసీ చైర్మన్ పెట్టి రూ.1000 కోట్లు- కేటాయిస్తామన్నారు..

-మిగతా 2 లో

## బీహార్‌లో 65 లక్షల ఓట్లు గల్లంతు

- పత్రాలు సమర్పించిన 91.6 శాతం ఓటర్లు : వెల్లడించిన ఈసీ
- మండిపడుతున్న ప్రతిపక్షం
- సవరణ ప్రక్రియను ఆపాలని డిమాండ్



**న్యూఢిల్లీ**

అనుకున్నంతా అయింది. ప్రతిపక్షాల ఆరోపణలు వాస్తవమేనని తేలింది. బీహార్‌లో ఓ పథకం ప్రకారం పెద్ద ఎత్తున ఓటర్లను తొలగించేందుకే ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను చేపట్టారంటూ వస్తున్న విమర్శలకు ఊతమిస్తూ ఆ రాష్ట్రంలోని 65 లక్షల మంది ఓటర్ల ఓటు హక్కును తొలగిస్తున్నట్లు ఎన్నికల

-మిగతా 2 లో

# చలో ఢిల్లీ

(మొదటి తరువాయి)

బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. దాదాపు నాలుగున్నర గంటలపాటు పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రధానంగా 42 శాతం బీసీ రిజర్వేషన్లపైనే చర్చ జరిగింది. బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదంలో కేంద్ర ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ ఆగస్టు 5వ తేదీ పార్టీ ఎంపీల ద్వారా పార్లమెంటులో వాయిదా తీర్మానం ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఆగస్టు 6వ తేదీ రాష్ట్రంలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులందరితో కలిసి జంతర్‌మంతర్ వద్ద 'చలో ఢిల్లీ' ధర్నాను నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్టు 7వ తేదీ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో దాదాపు 200 మంది ప్రజాప్రతినిధులతో రాష్ట్రపతిని కలిసి, పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లుల్ని ఆమోదించాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు. పంచాయతీ రాజ్‌చట్టం-2018లో 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు పంపిన ముసాయిదా ఆర్డినెన్స్‌ను న్యాయ పరిశీలన కోసం ఆయన రాష్ట్రపతికి పంపిన విషయం తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు కావాలంటే కీలకమైన ఈ బిల్లు ఆమోదం తప్పనిసరి. అందువల్ల దీనిపై నేరుగా రాష్ట్రపతినే కలిసి, విన్నవించాలని నిర్ణయించారు.

**చెక్‌పోస్టులు ఎత్తివేత**

రాష్ట్రంలో రవాణాశాఖకు చెందిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్ని ఎత్తివేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. జాతీయ రహదారులపై రవాణాకు ఇబ్బంది లేకుండా రాష్ట్ర సరిహద్దుల్లోని మొత్తం 15 చెక్ పోస్టులు ఎత్తివేస్తారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం వీటిని తొలగించాలని రాష్ట్రాలకు సూచించింది. అయితే ఈ చెక్ పోస్టుల్ని రవాణాశాఖ సిబ్బందితో కాకుండా వాహన్, అడ్వాన్స్‌డ్ సీసీ కెమెరాల ద్వారా మానిటరింగ్ చేయాలని నిర్ణయించారు. అలాగే రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, కోర్ తెలంగాణ అర్బన్ సిటీ ఏరియాల్లో మైక్రో బ్రూవరీస్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు మైక్రో బ్రూవరీస్ చట్టానికి పలు సవరణలు చేయాలని నిర్ణయించారు. మెడికల్ సీట్లకు సంబంధించిన జీవో 33పై కూడా మంత్రివర్గంలో చర్చ జరిగింది. ఎట్టిపరిస్థితుల్లోనూ తెలంగాణ విద్యార్థులకే మెడికల్ సీట్లు వచ్చేలా సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించాలని మంత్రులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. దీనికోసం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా నేతృత్వంలో అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డితో మాట్లాడి, సుప్రీంలో వాదనల కోసం సమర్థులైన న్యాయవాదుల్ని నియమించుకోవాలని సూచించారు. సమావేశం అనంతరం మంత్రివర్గ నిర్ణయాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ మీడియాకు వివరించారు.

# పాక్ దాడిని ప్రతిదాడితో ఘోరంగా దెబ్బతీసాం

(మొదటి తరువాయి)

రాజ్‌నాథ్ ఆవేదన వ్యక్తం చేశారు.ఇందుకు ప్రతిగా పాక్ ఉగ్రవాద స్థావరాలపై వ్యూహాత్మకం గా దాడి చేశామని, 9 ఉగ్ర శిబిరాలను భారత సైన్యం ధ్వంసం చేసిందని, 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టు-బెట్టిందని సభకు తెలిపారు. పాక్‌లో సామాన్యులకు ఇబ్బంది లేకుండా దాడులు చేశామన్నారు. సిందూర్ అనేది వీరత్వం, శౌర్యానికి ప్రతీక అని అభివర్ణించారు. ఉగ్రవాద శిబిరాలు, వారి మద్దతుదారులను లక్ష్యంగా చేసుకుని వారిని మట్టు-బెట్టడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టామని అన్నారు. ఆత్మరక్షణ కోసమే సైనిక చర్య తీసుకున్నామని, రెచ్చగొట్టడానికో, విస్తరణవాదంతోనే కాదన్నారు.మే 10వ తేదీన సుమారు 1.30 గంటలకు కూడా ఇండియాపై క్షిపణలు, డ్రోన్లు, రాకెట్లు-, ఇతర సుదీర్ఘ శ్రేణి ఆయుధాలపై దాడులకు పాక్ తెగబడిందని చెప్పారు ఎస్-400, ఆకాశ్ మిజైల్ సిస్టమ్ పూర్తిగా పాక్ దాడులను విఫలం చేశాయని అన్నారు. పాకిస్థాన్‌లోని పలు వైమానిక కేంద్రాలపై భారత వాయిసేన భీకరంగా విరుచుకు పడటంతో పాకిస్థాన్ ఓటమిని అంగీకరించి కాల్పుల విరమణ ప్రతిపాదన చేసిందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌కు విరామం ఇచ్చేందుకు కేవియట్‌తో ఆమోదించామని తెలిపారు. భవిష్యత్తులో పాక్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా ఆపరేషన్ తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు. ముందుగా నిర్ణయించిన రాజకీయ, మిలటరీ లక్ష్యాలు నెరవేరడంతో ఆపరేషన్ సింధూర్‌కు విరామం ఇచ్చిందని, ఒత్తిళ్ల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామనేదే పూర్తిగా తప్పని వివరించారు. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ అబద్ధం చెప్పకుండా ఉండేందుకే తాను ప్రయత్నించానని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో ఎన్ని విమానాలు కూలిపోయాయంటూ కొందరు విపక్ష సభ్యులు ప్రశ్నించారని, అయితే ఆ ప్రశ్న మన జాతీయ భావోద్వేగాలకు ప్రతిబింబించేదిగా లేదని తాను భావిస్తున్నానని రాజ్‌నాథ్ చెప్పారు. ఎన్ని శత్రు విమానాలను కూల్చేశారని మాత్రం విపక్షాలు ప్రశ్నించ లేదన్నారు. ఉగ్రవాద శిబిరాలను కూల్చేశారా అని తప్పనిసరిగా వాళ్లు ప్రశ్నించి ఉంటే దానికి అవునన్నదే తన సమాధానమని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందా అని అడగవచ్చని, అందుకు అవునన్నదే తన సమధానమని అన్నారు. మన సాహస జవాన్లు ఎవరైనా మరణించారా అని అడిగితే లేదన్నదే తన సమాధానమని అన్నారు. మన సైనికులెవ్వరికీ ఎలాంటి హాని జరగలేదని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. రాజ్‌నాథ్ ప్రసంగిస్తున్న సేపు అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు. పహల్గాంలో ఉగ్రదాడి హేయమైన చర్య అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మతం పేరు అడిగి మరీ పర్యాటకులను కాల్చి చంపారన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు భారత సైనికులు చాలా జాగ్రత్తలు తీసుకున్నారని, పాకిస్థాన్‌లోని సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దాడులు జరిపారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని గట్టిగా చెబుతున్నాం. ఇలాంటి ఆపరేషన్లు జరిగినప్పుడు చిన్న చిన్న విషయాలు పట్టించుకోకూడదు. 40 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నా.. ఇలాంటి ప్రశ్నలు ఎప్పుడూ వినలేదు. ఇలాంటి విషయాల్లో ఆచితూచి, ఆలోచించి ప్రశ్నలు అడగాలన్నారు. 1962లో చైనాతో యుద్ధం జరిగినప్పుడు విపక్షాలు ఎలాంటి ప్రశ్నలు వేశాయో తెలుసుకోవాలి. ఆనాడు విపక్షాలు భారత భూభాగం, మన సైనికుల పరిస్థితి గురించి ప్రశ్నించాయి. మన సైనికుల చర్యను వాజ్‌పేయీ ప్రశంసించారు. 1999లో శాంతియుత పరిస్థితిని కోరుతూ వాజ్‌పేయీ లాహోర్ యాత్ర చేపట్టారు. పాకిస్థాన్‌తో భారత్ స్నేహం కోరుకుంటోందని ఆనాడు వాజ్‌పేయీ చెప్పారు. స్నేహ హస్తం చాచడమే భారత్ గొప్పతనం. ఆనాడు వాజ్‌పేయీ తీవ్ర నిర్ణయం తీసుకుంటే పాక్ మర్నాడు సూర్యోదయం చూసేది కాదు. శాంతి కోరడం భారత్ రక్తంలోనే ఉంది. యుద్ధాలు కోరుకోం. ప్రతి విషయాన్ని మానవత్వ కోణంలో ఆలోచిస్తాం. తుపాకులు పేలితే ఎవరూ మిగలరని అన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాకిస్థాన్ అధికారులు పాల్గొన్నారు. దీనిని బట్టి వారిని ఆ దేశం ఎలా పెంచి పోషిస్తుందో స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటివరకు మనం ఎవరిపైనా దాడి చేయలేదు. పాకిస్థాన్ చరిత్ర, అక్కడి ఉగ్రవాదం గురించి తెలుసుకొని మాట్లాడాలి. మనిషి.. నీతి, నిజాయతీతో బతకాలని తులసీదాస్ దోహాలో చెప్పారు. భారత స్నేహహస్తాన్ని పాక్ అందుకోలేకపోయింది. మనదేశ ప్రజలను చంపుతుంటే సైన్యం చూస్తూ ఊరుకోదు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం.. ఆ దేశానికే ఇబ్బందిగా మారుతుందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

# పహల్గామ్ ఉగ్రవాదులు హతం

(మొదటి తరువాయి)

చూడటానికి వచ్చిన పర్యాటకుల్ని మతం పేరు అడుగుతూ చంపేశారు. ఈ ఘటన తర్వాత సంఘటనా స్థలం నుంచి పారిపోయారు. అయితే, ఈ ఘటనకు పాల్పడిన ముగ్గురు పాకిస్తాన్ అనుమానిత ఉగ్రవాదుల్ని జమ్మూ కాశ్మీర్‌లో సైన్యం చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. ఈ ఉగ్రవాదులు సైన్యం జరుపుతున్న ఎన్‌కౌంటర్‌లో చిక్కుకున్నట్లు- సంబంధిత వర్గాలు చెప్పాయి. హిర్వాన్ - లిద్వాస్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరుగుతోంది. గత 2 నెలలుగా ఈ ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు జమ్మూ కాశ్మీర్ వ్యాప్తంగా విస్తృతంగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. 'ఆపరేషన్ మహదేవ్' పేరుతో భద్రతా బలగాలు ఉగ్రవాదుల కోసం వేట మొదలుపెట్టి, ఉగ్రవాదుల్ని హతం చేశారు. భారత సైన్యం, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్పీఎఫ్), జమ్మూ కాశ్మీర్ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి. నివేదికల ప్రకారం, ఈ ముగ్గురు ఉగ్రవాదుల్ని భద్రతా బలగాలు మట్టు-పెట్టినట్లు- తెలుస్తోంది. అయితే, ఈ విషయం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. శ్రీనగర్‌లోని దాచిగమ్ నేషనల్ పార్క్ సమీపంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు కొనసాగాయి. కనీసం ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు చుట్టుముట్టాయి. వీరు పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులని తెలుస్తోంది.హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు- నిఘా వర్గాల సమాచారంతో నెల రోజుల నుంచి గాలింపు చేపట్టారు. చివరకు సోమవారం ఉదయం దాచిగమ్ అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపడుతుండగా.. భద్రతా దళాలపైకి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గల ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్ లోయ వద్ద ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. అతి సమీపం నుంచి కాల్పులు జరిపి 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ వ్యక్తి ప్రాణాలు తీశారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. అప్పటి నుంచి భద్రతా దళాలు ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట సాగిస్తున్నాయి. లష్కరే తయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'కు చెందిన ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లు- ప్రాథమికంగా నిర్ధరించారు

# ఏ గుర్తింపు కార్డునైనా ఫోర్జరీ చేస్తారుగా..

(మొదటి తరువాయి)

పై వ్యాఖ్యలు చేసింది. ఆధార్, రేషన్ కార్డుతో పాటు స్వయంగా ఈసీ జారీచేసిన ఐడీ కార్డును ప్రాథమిక పత్రాలుగా పరిగణనలోకి తీసుకోవాలని ఈసీకి సూచించింది. ఓ వ్యక్తిని ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తే, ఆ వ్యక్తి చేయాల్సింది, ఈసీ చేసేదేమిటో తెలిపే టైమ్ షెడ్యూలును సమర్పించాలని ఈసీని ఆదేశించింది.

# రాష్ట్రంలో మీనాక్షిపాదయాత్రలు

(మొదటి తరువాయి)

కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం ఆందోల్ నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తారు.ఆగస్టు 2న శ్రమదానం కార్యక్రమంతోపాటు- కార్యకర్తల సమావేశం ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు ఆర్మూరు లో పాదయాత్ర చేపడతారు. ఆగస్టు 3న ఉదయం శ్రమదానం నిర్వహించి, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఖానాపూర్ లో పాదయాత్ర ఉంటు-ంది.ఆగస్టు 4న ఉదయం శ్రమదానం అనంతరం కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం చొప్పదండి లో పాదయాత్ర చేసి రాత్రి బస చేస్తారు. ఆగస్టు 5న ఉదయం శ్రమదానం అనంతరం సమావేశం నిర్వహించి, సాయంత్రం వర్ధన్నపేట లో పాదయాత్ర చేపడతారు. చివరిగా ఆగస్టు 6న శ్రమదానం, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పాదయాత్రలను ముగిస్తారు.

# ప్రజాస్వామ్యంపై ఎస్ఐఆర్ దాడి

(మొదటి తరువాయి)

చేసే కుట్రగా ప్రియాంక గాంధీ పేర్కొ న్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఓటర్లను తొలగించడం కాదు వారి గొంతుకను వినడమే ప్రభుత్వాల బాధ్యత అని కేంద్ర ప్రభుత్వానికి హితవు పలికారు. బీహార్ ఎన్నికలకు ముందు కుట్ర పూరితంగా ఎస్ఐఆర్‌ను తీసుకువచ్చారని విమర్శించారు.

# మోడీ కాదు...రాహుల్ కన్వర్టెడ్

(మొదటి తరువాయి)

కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, కేసీఆర్.. సమగ్ర కుల సర్వే చేశాడు.. కానీ నివేదిక బయటపెట్టలేదన్నారు. తెలంగాణలో బీసీలు 52 శాతానికి పైగా ఉన్నారని, కులగణన కొన్ని మండలాల్లో జరగనే లేదు.. ఎలా పూర్తిచేశారన్నారు. నిజంగానే రాష్ట్ర ప్రభుత్వం చేస్తే నిజాలు ఎందుకు బయపెట్టడంలేదని, అందుకే కేంద్ర ప్రభుత్వం జన గణనతో పాటు- కుల గణన కూడా చేపట్టనుందన్నారు. అందులో వాస్తవాలు చెప్పి దాని ప్రకారం సంక్షేమ పథకాలు ఇంప్లిమెంట్ చేస్తామని, రాజ్యాంగం మారుస్తారని, ఎస్సీలకు రిజర్వేషన్లు ఎత్తేస్తారని అమిత్ షా మాట్లాడినట్లు- కాంగ్రెస్ సృష్టించిందన్నారు రాంచందర్ రావు. ఈ కేసు సీఎంపైనే ఉందని, రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఇచ్చినా ఇవ్వకున్నా.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేస్తామని, 42 శాతం పక్కాగా ఓన్లీ బీసీలకే ఇస్తామన్నారు. కాంగ్రెస్ చెబుతున్నట్లుగా వాటిలో కూడా 10 శాతం ముస్లింలకు ఇవ్వబోమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, బీసీలకు లబ్ధి చేకూర్చేలా కేంద్రం ముందుకు వెళ్తుంటే తమకు నష్టమని భావించి కాంగ్రెస్ దుష్ప్రచారాలకు దిగుతోందని ఆయన మండిపడ్డారు. ఎలక్షన్స్ ముందు సీఎం రేవంత్ ఇచ్చిన స్టేట్ మెంట్లు బయటపెడతాం.. ఆయన ఏం మాట్లాడాడో బయటపెడతామని ఆయన వ్యాఖ్యానించారు.

# బీహార్‌లో 65లక్షల ఓట్ల గల్లంతు

(మొదటి తరువాయి)

కమిషన్ ప్రకటించింది. గడువు ముగిసే సమయానికి 91.6 శాతం మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించారని తెలిపింది. రాష్ట్రంలో 7.8 కోట్ల మంది ఓటర్లు ఉండగా వారిలో 7.2 కోట్ల మంది అవసరమైన పత్రాలు అందజేశారని చెప్పింది. దీంతో జూలై జాబితాలలో పేరున్న 65 లక్షల మంది ఓటర్లను ఆగస్ట్ 1న ప్రచురించే ముసాయిదా జాబితాల నుంచి తొలగిస్తామని స్పష్టం చేసింది. 2.8 శాతం ఓటర్లు (22 లక్షలు) చనిపోయారని, 4.5 శాతం ఓటర్లు (26 లక్షలు) శాశ్వతంగా వెళ్లిపోయారని, 0.8 శాతం ఓటర్ల (ఏడు లక్షలు) పేర్లు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదై ఉన్నదని తెలియజేసింది.

# ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం

(మొదటి తరువాయి)



కోసం మద్యం అమ్మకాలనే నమ్ముకున్నదని ధ్వజమెత్తారు. నాగు ప్రగతి బాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని విమర్శించారు. మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునేందుకు కుట్ర పన్నుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.'నాడు కేసీఆర్ పాలనలో పల్లె, పల్లెకు ప్రగతి రథచక్రాలు. ప్రతి చేనుకు నీళ్లు.. ప్రతి చేతికి పని. ఇంటింటికి తాగునీళ్లు.. ఆడబిడ్డలకు తప్పిన ఇబ్బందులు. నాడు ప్రగతిబాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని నిందలు. నేడు పల్లె, పల్లెలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునే కుట్ర. అన్ని రంగాలలో తెలంగాణ ప్రగతిని దెబ్బతీసి .. ఇప్పుడు తీరిగ్గా ఆదాయం కోసం మద్యం అమ్మకాలను నమ్ముకున్న అసమర్థ కాంగ్రెస్ సర్కార్.ఏడాది క్రితం సగటున ఒక వ్యక్తి మద్యం కోసం చేసే ఖర్చు రూ.897. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో సగటున ఒక వ్యక్తి మద్యం మీద చేస్తున్న ఖర్చు రూ.1623కు పెరిగింది. లైసెన్స్ గడువు మూడేళ్లకు పెంచి, దరఖాస్తు ధర రూ.3 లక్షలకు పెంచాలని నిర్ణయం. నాడు మద్యం అమ్మకాలపై విమర్శలు, నేడు అధికారం దక్కించుకుని ఆదాయం కోసం మద్యం అమ్మకాలనే నమ్ముకున్న కాంగ్రెస్ సర్కార్. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం. పాలన గాలికి.. ప్రగతి కాటికి' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# తెలంగాణకు కొత్తగా నలుగురు జడ్జిలు

(మొదటి తరువాయి)



చేసింది. కాగా, 19 మందిలో తెలంగాణ హైకోర్టుకు నలుగురు జడ్జీలను నియమించారు. గాడి ప్రవీణ్‌కుమార్, చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గౌస్ మీరా మొహుద్దీన్ లు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణం చేయనున్నారు. తెలంగాణతోపాటు- మధ్యప్రదేశ్ హైకోర్టుకు ఏడుగురు జడ్జీలు, నలుగురు అదనపు జడ్జీలు.. ఇక, అస్సాం హైకోర్టుకు నలుగురు జడ్జీలను నియమితులయ్యారు.

## 2025 జూలై 29, మంగళవారం -తెలుగు పంచాంగం




**మాసం - పక్షం**
శ్రావణమాసం (అమాంత)
శుక్లపక్షం
**తిథి**
పంచమి: జూలై 28, రా. 11:24 నుండి-జూలై 30, మధ్యాహ్నం 12:46 వరకు
షష్టి: జూలై 30, మధ్యాహ్నం 12:46 నుండి జూలై 31, రాత్రి 2:41 వరకు
**నక్షత్రం**
ఉత్తరఫల్గుణి: జూలై 28, సాయంత్రం 5:35 -
జూలై 29, సాయంత్రం 7:27 వరకు
హస్త: జూలై 29, సాయంత్రం 7:27 -జూలై 30, రాత్రి 9:53 వరకు
**శుభ సమయాలు**
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:22 - 5:10
అభిజిత్ ముహూర్త: మధ్యాన్హం 11:57 - 12:48
అమృతకాలం: మధ్యాహ్నం 11:41-సాయంత్రం 1:25
**అశుభ కాలాలు**
రాహుకాలం: సాయంత్రం 3:34- 5:10
యమగండం: ఉదయం 9:10-10:46
వర్జ్యం: రాత్రి 4:42 - 6:28
దుర్ముహూర్తం: ఉదయం 8:32- 9:23
మరియు రాత్రి 11:15- 12:00

# బ్రహ్మం గారి గాన సుధా కళాభారతిలో భక్తి స్వరాల సీతారామం



**కరీంనగర్, జూలై 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్‌లో జరిగిన "బ్రహ్మం గారి గాన సుధా" వీడియో పాట ఆవిష్కరణ కార్యక్రమం అలౌకిక సంగీత తరంగాలతో కళాభారతిని మైమరిపించింది. కెఎస్ఆర్ క్రియేషన్స్ పతాకంపై కాయితోజు పవన్ కుమార్ నిర్మించిన ఈ పాటను పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 8వ తరం వంశస్థుడు వీరభద్ర స్వామి ఆవిష్కరించడం ఈ వేడుకకు అద్భుతభూమికను ఏర్పరిచింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కరీంనగర్‌కు రావడం నా కలలా అనిపిస్తోంది. బ్రహ్మం గారి జీవితాన్ని ఆధారంగా రాసిన పాటను నా చేతులమీదుగా ఆవిష్కరించడం నా అదృష్టం," అని హర్షం వ్యక్తం చేశారు. కాలజ్ఞాన తత్వాలను భక్తులకు వివరిస్తూ, ప్రతి విశ్వబ్రాహ్మణుడు, విశ్వకర్ముడు బ్రహ్మం గారి చరిత్రను ముందువరుస ప్రజలకు తెలియజేయాలనే పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని మరింత చైతన్యవంతంగా మార్చినవి చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు. వారి వినూత్న వినోదం, చక్కటి నృత్యాలు సభలోని ప్రేక్షకులను అలరించాయి. వేడుకలో పాట నిర్మాత పవన్ కుమార్, గాయకులు కిట్ల శ్రీను, రచయిత రంగు గోవర్ధన్, వోపా కన్వీనర్ ద్రోణచారి, శ్రీరామోజు భగవాన్, తిరుమల చార్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాయితోజు పవన్ కుమార్ మాట్లాడుతూ, "బ్రహ్మం గారి గాన సుధా పాట భక్తుల మనసుల్లో కొత్త విశ్వాసాన్ని నింపుతుంది. భవిష్యత్ తరాలకు బ్రహ్మం గారి ఆలయంలోని ఔన్నత్యాన్ని పరిచయం చేసే ప్రయత్నం ఇది," అని చెప్పారు. అలాగే తెలంగాణ విశ్వబ్రాహ్మణ అర్చక పురోగతి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి బ్రహ్మాచారి గారు మాట్లాడుతూ, బ్రహ్మం గారి జీవిత తత్వాన్ని అర్థం చేసుకుని జీవన గమనాన్ని మలచుకోవాలని సూచించారు.

## అంగరంగ వైభోగంగా శ్రావణమాస బోనాల ఉత్సవాలు...

- ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్...



**కుత్బుల్లాపూర్, జూలై 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నియోజకవర్గ సూరారం డివిజన్ పరిధిలోని స్కంద నగర్ లో శ్రావణ మాస బోనాల పండుగ సందర్భంగా పోచమ్మ తల్లి ఆలయని కి దొడ్ల ఆంజనేయులు మరియు కమిటీ సభ్యుల ఆహ్వాన మేరకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమని కి ముకుందా రావు ,తాటి రవి కుమార్ ,శ్రీను, అంజయ్య లక్మణ్, సుధాకర్ డేవిడ్ మరియు బస్తీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన పీర్ల మస్జీద్‌కు భూమి పూజ



**బాచుపల్లి, జూలై 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లిలో మైనారిటీ సోదరుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్మించనున్న నూతన పీర్ల మస్జీద్‌కి భూమి పూజ కార్యక్రమం వైస్ ఎంపీపీ కొలన్ కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మస్జీద్ నిర్మాణానికి సంబంధించిన భూమిని పునీతంగా భావిస్తూ మైనారిటీ భౌతిక సదుపాయాల పెంపునకు ఇది మార్గదర్శకంగా నిలుస్తుందని సూచించారు. ఈ సందర్భంగా మైనారిటీ సోదరుల ఆహ్వానం మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ముస్లిం సామాజిక పెద్దలతో కలిసి మస్జీద్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం స్థానిక మైనారిటీ ప్రజలు ఆయనకు శాల్వా కప్పి హృదయపూర్వకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో గౌరవంగా ఉందని హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నందిగామ సత్యనారాయణ, కాసాని వీరేష్, కాసాని సుధాకర్, మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, ఎన్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, కొలన్ బాల్ రెడ్డి, మండల్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సయ్యద్ కలీల్ ఖాన్, ఎన్ఎంసీ మైనారిటీ జనరల్ సెక్రటరీ మొహమ్మద్ షకీల్, సయ్యద్ ఫారూఖ్, సయ్యద్ షకీల్, సయ్యద్ సలీమ్, సయ్యద్ అక్బర్, మొహమ్మద్ ఖాజా, మొహమ్మద్ చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాలు పోతున్నా పరిష్కారం ఎందుకు లేదు..?


- రఘునాథ్ యాదవ్ ఆవేదన



**షాద్ నగర్, జూలై 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
షాద్ నగర్ పట్టణంలోని ప్రధాన కూడలిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రి, కూతురు మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ ఘటనపై పట్టణ యువ నాయకుడు రఘునాథ్ యాదవ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, "ముఖ్య కూడలి అంటే అందరికీ అవసరంగా ఉండాలి కానీ ప్రాణాలు తీయడానికి కాదు" అంటూ స్పందించారు. అతని అభిప్రాయం ప్రకారం, ఈ ప్రాంతం యమకూపంగా మారి, నిరంతరం ప్రజల ప్రాణాలను హరించే స్థితికి చేరిందని, ఎన్నో కుటుంబాలు తమ కుటుంబ పెద్దలను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ముఖ్య కూడలిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. అనేక ప్రాంతాల నుంచి షాద్ నగర్‌కు వలస వచ్చిన జనాభా పెరుగుతున్నా, రోడ్ల వెడల్పు, ట్రాఫిక్ నియంత్రణ, పాదచారుల సురక్షిత మార్గాలపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. వ్యాపారస్తులు కూడా రోడ్డు వెడల్పునకు సహకరించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ నేపథ్యంలో, మున్సిపల్ అధికారులు, రోడ్లు మరియు భవనాల శాఖ, ట్రాఫిక్ శాఖ, వ్యాపారస్తులు కలిసి తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలను కాపాడే విధంగా వ్యవహరించాలని రఘునాథ్ యాదవ్ పిలుపునిచ్చారు. ట్రాఫిక్ నియమాలను పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, స్పీడ్ నియంత్రణ విధానాలను అమలు చేయాలని కోరారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాల్సిందే

**దేవరకొండలో 200 మంది ఆదివాసీల బీఆర్ఎస్‌లో చేరిక**



**దేవరకొండ, జూలై 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కొండమల్లేపల్లి మండలంలోని చింత చెట్టు తండా, వడ్యా తండా, జేత్య తండా, ఫుల్ సింగ్ తండాలకు చెందిన 200 మంది ఆదివాసీ సోదరులు సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దేవరకొండ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఇప్పటికే అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా దేవరకొండ నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో వచ్చిన నిధులకు మరోసారి శంకుస్థాపన చేయడం తప్ప, కొత్తగా ఏ పని చేయలేదని విమర్శించారు. ప్రజల ధనాన్ని హేతుబద్ధంగా వినియోగించకుండా కాంగ్రెస్ నేతలు లూటీ చేస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. దేవరకొండలో కోటి రూపాయల ప్రజా ధనం వృథా అయిందని, ప్రజలు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు ప్రజలకు చేసిన మోసాన్ని గుర్తు చేస్తూ, మోసపూరిత హామీలకు తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని రవీంద్ర కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

## ఇల్లంతకుంట మండలం నుంచి బీజేపీలోకి భారీ చేరికలు

- బండి సంజయ్ సమక్షంలో పార్టీలోకి ఆహ్వానం



**ఇల్లంతకుంట, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇల్లంతకుంట మండలం వంతడుపుల గ్రామం నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా భారతీయ జనతా పార్టీలో చేరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణరెడ్డి పార్టీలో చేరిన వారందరికీ కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు గోపి, మండల ఇన్‌చార్జి అడిచెర్ల రాజు, మండల అధ్యక్షుడు భూమల్ల అనిల్, సీనియర్ నాయకులు బాల్ రెడ్డి, వంతడుపుల గ్రామ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన నాయకులు బీజేపీ అభివృద్ధి దిశలో తమ సేవలు అందిస్తామని తెలిపారు.

## ప్రజావాణిలో 76 ఫిర్యాదులు

- అధిక ప్రాధాన్యతతో పరిష్కరించాలన్న అడిషనల్ కలెక్టర్

**రంగారెడ్డి, జూలై 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ అధ్యక్షతన ప్రజావాణి నిర్వహించారు. 76 ఫిర్యాదులు అందగా, వాటిలో రెవెన్యూ శాఖకు 32, ఇతర శాఖలకు 44 దరఖాస్తులు చేరాయి. తక్షణ స్పందనతో సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆమె ఆదేశించారు. డీఆర్ఓ సంగీత, తహసీల్దారులు, మున్సిపల్ అధికారులు, ఇతర శాఖల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో వైభవంగా పల్లకీ సేవ



**షాద్ నగర్, జూలై 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం భక్తి శ్రద్ధలతో పల్లకీ సేవ నిర్వహించబడింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భజన భక్త బృందం ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ "శ్రీరామ జయరామ, జయ జయ రామ" నినాదాలతో ఊరేగింపు జరిపారు. భక్తి పాటలు, భజనలతో ఆలయం మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్ర చార్య, అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతులు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చటాన్ పల్లి బివి రావు నగర్‌కు చెందిన పౌల్ట్రీ రైతు గుడే మస్తాన్ రావ్, శివరాణి దంపతుల కుమార్తె దివ్యశ్రీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది. భక్తులకు ఆహారాన్ని అందించిన ఈ కుటుంబానికి దేవాలయ అభివృద్ధి కమిటీ తరఫున పూలమాలతో సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్, అన్మారి వెంకటయ్య, జి. వసంతరావు, అన్నారం రఘు గౌడ్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, మానపాటి ప్రదీప్ కుమార్, శంకర్ గౌడ్, జి. సతీష్, శ్రీనివాసరావు, క్యాసెట్ శ్రీనివాస్, సుప్ప నర్సింలు, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, శంకరయ్య, వీఆర్వో బచ్చన్న, సుప్ప కృష్ణయ్య, యాదగిరి, పి. ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, రవి, హనుమంత్ రెడ్డి, రవీందర్, నరసింహులు, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, భజన భక్త బృందం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రులపై నిత్యం తనిఖీలు జరపాలి

## సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్



**షాపూర్ నగర్, జూలై 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకొని ప్రైవేట్ ఆసుపత్రులు అమాయకులను మోసం చేస్తున్నాయని, దీనిపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సృష్టి ఫర్టిలిటీ సెంటర్‌లో జరిగిన మోసంపై స్పందిస్తూ, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు నిత్యం తనిఖీలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా షాపూర్ నగర్‌లో జరిగిన సమావేశంలో ఉమా మహేష్ మాట్లాడుతూ, ఐవీఎఫ్, టెస్ట్ ట్యూబ్ పేరుతో పిల్లలు పుట్టిస్తామని చెప్పి అమాయక దంపతులను మోసం చేయడం, వేరే వారి డీఎన్ఏతో సరోగసీ ద్వారా పిల్లలను పుట్టించడం, దానికి సుమారు 30 లక్షలు వసూలు చేయడం వంటి ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. బాబు పుట్టిన తర్వాత డీఎన్ఏ పరీక్షలో తల్లిదండ్రుల డీఎన్ఏతో సరిపోలకపోవడం, ఆసుపత్రి నిర్వాహకులు నిజాన్ని దాచడం దారుణమని పేర్కొన్నారు. ఇలాంటి మోసాలకు పాల్పడిన ఆసుపత్రులను సీజ్ చేయడమే కాకుండా, సంబంధిత వైద్యుల డాక్టరేట్‌ను రద్దు చేసి మరోసారి ప్రాక్టీస్ చేయకుండా నిషేధించాలని ఉమా మహేష్ డిమాండ్ చేశారు. ఒక ఆసుపత్రిలో జరిగిన ఘటన మాత్రమే కాదు, మరెన్నో ఆసుపత్రుల్లో ఇలాంటి మోసాలు జరుగుతున్నాయేమోనన్న అనుమానం ఉందని, అందువల్ల అన్ని ఆసుపత్రులపై అధికారులు నిఘా పెంచాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం, మండల కార్యదర్శులు కే స్వామి, పి శ్రీనివాస్, ఏఐటీయూసీ కార్యదర్శి వి శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నరసింహారెడ్డి, ఆశీ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# వావిలాల రామాలయంలో వైభవంగా శ్రీ గోదాదేవి తిరునక్షత్ర మహోత్సవం

- భక్తుల సమక్షంలో ఓడి బియ్యం సమర్పణ, తీర్థప్రసాద వితరణ



**కరీంనగర్, జూలై 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వావిలాల పల్లె రామాలయంలో ఈ రోజు ఉదయం 10.30 గంటలకు శ్రీ గోదాదేవి (ఆండాలు) తిరునక్షత్ర మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి భక్తులు ఓడి బియ్యం సమర్పించి తమ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. అనంతరం తీర్థప్రసాద వితరణ జరిపారు. ఈ మహోత్సవంలో మాజీ కార్పొరేటర్ మేచినేని వనజ, ఆలయ అధ్యక్షులు అశోక్ రావు, సెక్రటరీ బీవి రావు, పద్మ వెంకటేశం పాల్గొన్నారు. డివిజన్ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని మరింత వైభవంగా మార్చారు. భక్తుల ఉత్సాహం, నిర్వాహకుల సమర్పణ ఈ వేడుకను ప్రత్యేకంగా నిలిపాయి.

# బొగ్గు పరిశ్రమ రక్షణకు ఉద్యమ శంఖారావం



**రామగుండం, జూలై 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రామగుండం-III ఓసిపి-II లో సింగరేణి కార్మిక సంక్షేమం లక్ష్యంగా బిఎంఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా జూలై 24 నుండి సెప్టెంబర్ 15 వరకు బొగ్గు పరిశ్రమ రక్షణకు నాలుగు దశల ఆందోళనలు సాగనున్నట్టు తెలిపారు. సింగరేణి విద్యుత్ సంస్థలకు రూ.39,600 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలని, సొంత ఇల్లు, ఆదాయపు పన్ను రీయింబర్స్‌మెంట్ పథకాలను అమలు చేయాలని డిప్యూటీ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ రావు డిమాండ్ చేశారు. సమావేశంలో ఇతర ముఖ్య నేతలు పాల్గొని, ఉద్యమ పోకడలను ఖరారు చేశారు. అనంతరం ఆందోళన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

# వృద్ధాశ్రమం, స్వాధార్ హోమ్ సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి



**కరీంనగర్, జూలై 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె. వెంకటేష్ ప్రభుత్వ వృద్ధాశ్రమం, వికలాంగుల ఆశ్రమం, స్వాధార్ హోమ్‌ను సందర్శించారు. వృద్ధులతో ముచ్చటించి, విద్యార్థులకు జీవితంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆహార నిల్వ గదులను తనిఖీ చేసి పరిశుభ్రతపై సూచనలు ఇచ్చారు. న్యాయ సహాయం అవసరమైతే సంప్రదించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం పండ్ల పంపిణీ చేశారు.

# గంగాధరలో ఆరోగ్య కేంద్రం, ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి



**గంగాధర, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి సర్ఫరాజ్ అహ్మద్ గంగాధరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎరువుల దుకాణాన్ని సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఆరోగ్య కేంద్రంలో రిజిస్టర్లు, పరిశుభ్రతను పరిశీలించి, సీజనల్ వ్యాధుల నివారణకు మందుల నిల్వలపై సూచనలు ఇచ్చారు. ఎరువుల దుకాణంలో కొనుగోళ్ల రిజిస్టర్లు, నిల్వలు, రైతుల వివరాలను పరిశీలించి, వ్యవసాయ అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు అందించారు.


# రామడుగు ఆరోగ్య కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించిన వైద్యాధికారులు



**రామడుగు, జూలై 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రామడుగు మండలంలోని గుండి, రామడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ, ఉప వైద్యాధికారి డాక్టర్ రాజగోపాల్ రావు సందర్శించారు. రిజిస్టర్లు, రికార్డులు, పరిశుభ్రతను పరిశీలించి, ఎన్‌సీడీ క్లినిక్‌లో అధిక రక్తపోటు, షుగర్ బాధితులకు ఉచిత మందుల పంపిణీపై సూచనలు ఇచ్చారు. లేబరేటరీ, ఫార్మసీ, ప్రసూతి గదులను తనిఖీ చేసి, సాధారణ డెలివరీలపై అవగాహన కల్పించారు. పేషంట్లతో మాట్లాడి అందుతున్న సేవలపై స్పందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గ్రీష్మాన్య, డిపిఓ స్వామి, అధికారి రామనాథం తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ ప్రజావాణికి 328 దరఖాస్తులు

-అధికారుల సమక్షంలో సమస్యల పరిష్కారానికి చర్యలు



**కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 328 మంది అర్జీదారులు హాజరై తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, రెవిన్యూ డివిజనల్ అధికారులు మహేశ్వర్, రమేష్ తదితరులు ప్రజల నుండి వినతులు స్వీకరించారు. అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ పరిధిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత సెక్షన్ అధికారులు తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు.

# భువనేశ్వర్ కార్యశాలలో కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, జూలై 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పారిశుధ్య కార్మికుల భద్రతపై ఒడిశా ప్రభుత్వం నిర్వహించిన జాతీయ కార్యశాలలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లాలో యూనిసెఫ్ భాగస్వామ్యంతో అమలు చేస్తున్న ఆరోగ్య కార్డులు, పిపిఈ కిట్లు, ఉచిత వైద్య సేవలు, బీమా పథకాలు వంటి చర్యలను వివరించారు. ఇతర రాష్ట్రాల ప్రతినిధులు ఈ విధానాలను ప్రశంసించారు.

# 272 సర్వే నంబర్‌లో రిజిస్ట్రేషన్లన్నీ రద్దు చేయాలి

- ప్రొహిబిటెడ్ భూములపై సమగ్ర విచారణ జరపాలని సీపీఐ డిమాండ్



**కరీంనగర్, జూలై 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కొత్తపల్లి హవేలి రెవెన్యూ పరిధిలోని 272 సర్వే నంబర్‌లో ఉన్న 24.24 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని, చట్ట విరుద్ధంగా జరిగిన అన్ని రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ భూమి విలువ రూ.200 కోట్లకుపైగా ఉంటుందని, కరీంనగర్%-%జగిత్యాల జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఈ స్థలాన్ని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. కొత్తపల్లిలోని మెడికల్ కాలేజీ ఎదురుగా ఉన్న ఈ భూమిని ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చినప్పటికీ, గత పాతికేళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ, అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేవలం 9 డాక్యుమెంట్లను మాత్రమే రద్దు చేయడం సరైనది కాదని, 272 సర్వే నంబర్‌లో జరిగిన అన్ని రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రొహిబిటెడ్ ప్రాపర్టీలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని పంజాల శ్రీనివాస్ స్పష్టం చేశారు. కొంతమంది పేరు, పలుకుబడి ఉన్నవారిని అధికారులు కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ, సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేయడమే కాకుండా, పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# వర్షాకాలం సన్నద్ధతపై క్షేత్రస్థాయి తనిఖీలు



**కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి సర్ఫరాజ్ అహ్మద్ సోమవారం గంగాధర, రామడుగు మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఎరువుల దుకాణాలను సందర్శించారు. వ్యవసాయ అధికారులు ఎరువుల అమ్మకాలను నమోదు చేసి, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వరద ముంపు ప్రాంతాల్లో శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీల నిర్మాణం, అసంపూర్తి నాళాల పూర్తి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇంటింటి ఆరోగ్య సర్వే పూర్తి చేసి, సీజనల్ వ్యాధుల నివారణకు మందుల నిల్వలు సిద్ధంగా ఉంచాలని వైద్య అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పటాన్చెరులో ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రారంభం

- ఒక కోటి 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణం



**సంగారెడ్డి, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పటాన్చెరు నియోజకవర్గం రామచంద్రపురం డివిజన్ పరిధిలోని ఎస్సీ కాలనీలో రూ.1.30 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, స్థానిక కార్పొరేటర్ పుష్ప నగేష్ యాదవ్, పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కమ్యూనిటీ హాల్ ద్వారా స్థానిక ఎస్సీ వర్గాలకు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అనుకూల వేదిక లభించనుందని ప్రజాప్రతినిధులు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణ సమితి యొక్క లక్ష్యాలు మరియు మిషన్

- లక్ష్యం

సుస్థిరమైన, ఆరోగ్యకరమైన జీవనవాతావరణం కోసంపర్యావరణాన్ని రక్షిస్తూ, ప్రజల ఆరోగ్యం, ఆయుష్షు పెంపుకు కృషి చేయడం.

మిషన్

- శాస్త్రీయ పద్ధతుల్లో పర్యావరణ పరిరక్షణ
- గాలి, నీరు, నేలపై కాలుష్య నివారణ
- విద్య, సాంకేతికతతో ప్రజల్లో అవగాహన
- యువతకు పది వేల ఉద్యోగ అవకాశాలు
- అభివృద్ధి -పర్యావరణాన్ని సమతుల్యంగా ముందుకు నడిపించడం
- మాదకద్రవ్యాల రహిత భారత దేశ ఆవిష్కరణ
- భారతీయ సాంప్రదాయాల విస్తృత ప్రచారం

# 90 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం

### పేదల కళ్లలో ఆనందం చూడటమే లక్ష్యమన్న ఎమ్మెల్యే విజయరమణ రావు



**పెద్దపల్లి, జూలై 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గౌరెడ్డిపేట, ముత్తారం గ్రామాల్లో సోమవారం ఉదయం ?90 లక్షల రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. డ్రైనేజీలు, సిసి రోడ్లు, మహిళా సంఘం భవనం నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల పనులకు శ్రీకారం చుట్టారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరి పత్రాలను స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు మాట్లాడుతూ, పేదల కళ్లలో ఆనందం చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు. గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఇల్లు, రేషన్ కార్డులు ఇవ్వకుండా వంచించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రెండు లక్షల రూపాయల రుణమాఫీ, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఉచిత కరెంటు, ఉచిత ఆర్టీసీ బస్సు, సన్నబియ్యం పంపిణీ, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వైద్య సదుపాయం, వడ్ల కొనుగోలుకు బోనస్, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. తాను 24 గంటల్లో 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తున్నానని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి, సంక్షేమం మరింత ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, సింగిల్ విండో నర్సింహా రెడ్డి, నుగిళ్ల మల్లన్న, సయ్యద్ మస్రత్, సందనవేణి రాజేందర్, కలవేణి మహేందర్, ఏడల్లి శెంకర్, ముత్యాల నరేష్, ఆర్మూటీ సంతోష్, కడర్ల శ్రీనివాస్, కట్కూరి సుధాకర్ రెడ్డి, కొమ్ము శ్రీనివాస్, పోల్సని మల్లేష్, కొమ్ము కర్ణాకర్, కొమ్ము అభిలాష్, చిట్టావేన మోహన్, నల్లగొండ కుమార్, గుర్రం రమేష్, ఏద్దు కుమార్, కోట శరత్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

**మెట్ పల్లి జూలై 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మెట్ పల్లి పట్టణానికి చెందిన ఉమతుల్ రషీదా కు మంజూరైన ఒక లక్ష అరవై వేయిల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమ్మద్ షాకీర్ సిద్ధికి ఆయన నివాసంలో లబ్ధిదారు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ నదీమ్ పాల్గొన్నారు.

# షాపూర్ నగర్‌లో లబ్దిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన కూన శ్రీశైలం గౌడ్



**షాపూర్ నగర్, జూలై 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
షాపూర్ నగర్ వేదికగా జరిగిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం సుదీర్ఘకాలం గుర్తుంచుకునేలా సాగింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల ప్రజలకు వైద్య అవసరాలకు ఆర్థిక సహాయం అందించే ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నేతృత్వం వహించారు. అనారోగ్య పరిస్థితులతో బాధపడుతున్న జి. నర్సయ్య, జరిపేటి బ్రమేశ్వర్, వీర్ల సువర్ణ, జాలిం పవన్, యండి బషీరుద్దీన్, నక్క సురేష్ బాబు, కరల కాంత, నగల నాగమణి, జయలక్ష్మి, సంపంగి బాలమణి, టేకులపల్లి అశోక్ గౌడ్ లకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కులను ఆయన స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, "సిఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయం పేదలకు కొండంత భరోసా. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తోంది," అని కొనియాడారు. అలాగే ఆరోగ్యశాఖ మంత్రివర్యులు శ్రీ దామోదర్ రాజానర్సింహా చొరవతో పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి రావడం విశేషం అని వివరించారు.




కరీంనగర్ నగరంలో వర్షం వల్ల రోడ్లపై నీరు నిలుస్తున్న ప్రాంతాలను పరిశీలించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి సర్ఫరాజ్ అహ్మద్

# ప్రజావాణిలో బీజేపీ నాయకుల ఫిర్యాదు

### అక్రమ నిర్మాణాలపై తీవ్ర ఆందోళన



**మేడ్చల్, జూలై 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
:మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జూలై 28న జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ బీజేపీ నాయకులు గాగిల్లాపూర్, డి. పోచంపల్లిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులను పలుకరించారు. ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్ కు కేటాయించిన భూమిని ఆక్రమించారంటూ జిల్లా ఇంచార్జి అధ్యక్షుడు డా. ఎస్. మల్లారెడ్డి స్వయంగా పరిశీలించారు. గతంలో కూల్చిన నిర్మాణాలు మళ్లీ కొనసాగుతున్నాయని స్థానిక బీజేపీ నాయకులు ఎమ్మార్వోకు ఫిర్యాదు చేశారు. మస్జీద్, మధర్సాల పేరుతో భూములు ఆక్రమించి విక్రయిస్తున్నారని ఆరోపించారు. అవసరాల కోసం వదిలిన స్థలాలు సైతం ఇలానే ఆక్రమణకు గురవుతున్నాయని గుర్తించారు. ఈ కార్యక్రమంలో పీసరి కృష్ణారెడ్డి, దమ్మగారి ప్రభాకర్ రెడ్డి, ఎన్. రోజా, కొమ్ము ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జైపాల్ రెడ్డి 6వ వర్ధంతి




**ఆమనగల్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత ఎస్. జైపాల్ రెడ్డి 6వ వర్ధంతిని పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో, పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ చైర్మన్ గీత నర్సింహా తదితరులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జైపాల్ రెడ్డి సేవలను కొనియాడుతూ, ఆయన ప్రజాసేవా తపనను గుర్తు చేశారు. కార్యక్రమంలో యాట నరసింహ, తెల్గమల్ల జగన్, వస్పుల మానయ్య, ఖలీల్, మల్లయ్య, దశరథం, కృష్ణ నాయక్, హలీం, శ్రీకాంత్, ఖాదర్, మైసయ్య, శీను నాయక్, శేఖర్ గౌడ్, మహేష్, విజయ్, ఫరీద్, సురేష్, నర్సింహా, రాందాస్, కిషన్ నాయక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో 2.06 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం


- ఇందిరమ్మ ఇండ్ల కలను సాకారం చేస్తున్నాం
- ఎమ్మెల్యే విజయరమణ రావు



**పెద్దపల్లి, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఓదెల మండలం గుంపుల, గూడెం, ఇందుర్తి గ్రామాల్లో 2.06 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఇందుర్తి గ్రామంలో మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించిన అనంతరం, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలు అందజేసి, ఇంటి నిర్మాణాలకు ముగ్గు పోసి ప్రారంభించిన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ప్రజల అభినందనలు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, 3500 ఇండ్లు ఇప్పటికే మంజూరు చేశామని, అదనంగా మరో 1000 ఇండ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇండ్లను మొదటి విడతలో మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. రైతులకు 21 వేల కోట్ల రుణమాఫీ, 500 బోనస్, 12,000 పెట్టుబడి సహాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి పెంపు, 500 గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు అమలవుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామస్థులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

# రేకుర్తి ఆలయ సందర్శించిన గంగుల కమలాకర్

- 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్ డిమాండ్



**కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రేకుర్తి శ్రీలక్ష్మీనర్సింహాస్వామి దేవాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి నిధులు సమకూర్చి యాదాద్రి తరహాలో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. బీసీలకు 9వ షెడ్యూల్‌లో 42% రిజర్వేషన్ పొందుపరచాలని రేవంత్‌రెడ్డికి డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ కుట్రలను ప్రజలు గుర్తించారని, బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ కోసం పని చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ సిద్ధంగా ఉండాలి

### అభ్యర్థుల గెలుపు కోసం కలిసికట్టుగా కృషి చేయండి - గంగాడి కృష్ణారెడ్డి



**కొత్తపల్లి రూరల్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొత్తపల్లి రూరల్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ సిద్ధంగా ఉండాలని, నాయకులు, కార్యకర్తలు బూత్ స్థాయిలో కార్యాచరణ చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి, మోడీ ప్రభుత్వ విజయాలను ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు కుంట తిరుపతి, శక్తి కేంద్ర ఇన్‌చార్జులు కడార్ల రతన్ కుమార్, వేముల అనిల్ కుమార్, కోమటిరెడ్డి అంజన్ కుమార్, సోమినేని కర్ణాకర్, గుడిసెల రంజిత్ కుమార్, పోర్తి అనిల్ కుమార్, బోనాల నరేష్, కడారి శ్రీనివాస్, బోయిని మహేందర్, కట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అక్కను హతమార్చిన తమ్ముడు కొత్తూరు మండలం వెంజర్ల గ్రామంలో తీవ్ర విషాదం

- అనుమానం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు,పెంజర్ల గ్రామస్తులు
- హత్య కేసును దర్యాప్తు చేస్తున్నట్లు మీడియాకు తెలియజేసిన కొత్తూరు పోలీసులు




**షాద్ నగర్, జూలై 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్ల గ్రామానికి చెందిన రాఘవేందర్ (42)కు ఇద్దరు సంతానం కూతురు రుచిత మరియు కుమారుడు రోహిత్ అయితే విశ్వసనీయ సమాచారం ప్రకారం సోమవారం మధ్యాహ్నం రాఘవేందర్ ఒక్కగానొక్క కూతురు రుచిత తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మంచం పై చనిపోయి ఉన్నట్టు గమనించిన ఇరుగుపొరుగు వారు తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు వచ్చి చూసేసరికి రుచిత మిగతజీగా మంచం పై పడిపోయి ఉన్నట్లు గమనించారు. వెంటనే కొత్తూరు పోలీసులకు సమాచారం అందించారు. అయితే తమ కుమారుడు రోహిత్ ఈ దారుణానికి పడపడినట్లు తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న కొత్తూరు పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా రోహిత్ పరారీలో ఉన్నట్లు తెలిసింది. కేసు దర్యాప్తులో భాగంగా రోహిత్ ను వెతికి పట్టుకునే ప్రయత్నంలో ఉన్నట్టు పోలీసులు మీడియాకు సమాచారం అందించారు. దర్యాప్తులో భాగంగా పూర్తి వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు కొత్తూరు ఎస్సై తెలియజేశారు.

# ఎల్లుపేటలో బీజేపీలో చేరికలు

-గోదావరి అంజి రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీల కార్యకర్తలకు ఆహ్వానం



**సంగారెడ్డి, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండలం ఎల్లుపేట గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీజేపీలో చేరారు. జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి ఆధ్వర్యంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు జగదీశ్వర్, అసెంబ్లీ కన్వీనర్ మఠం చంద్రశేఖర్, మండల అధ్యక్షులు శంకర్, పట్టణ అధ్యక్షులు, ముత్యాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి మా చిహ్నం

- హనుమకొండలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విమర్శల వెల్లువ



**హనుమకొండ, జూలై 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ అభివృద్ధి పనులపై విశేష వివరాలు తెలిపారు. సమావేశంలో ఆయన మాట్లాడిన ప్రతి మాటలో ప్రజా సంక్షేమంపై గౌరవం, ప్రత్యర్థుల తీరుపై నిస్పృహత స్పష్టంగా కనిపించింది. ప్రభుత్వం ప్రధాన రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని ఆయన పేర్కొన్నారు. హనుమకొండ జిల్లాలో రూ.467 కోట్ల మేరకు నిధులు మంజూరు చేసిన విషయం ప్రజల అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తుందని వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నగరాభివృద్ధి జరుగుతుందన్న ఆయన మాటలు ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని కలిగించాయి. ఒకేసారి రూ.205 కోట్ల నిధులను విడుదల చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందుతుందని గర్వంగా తెలియజేశారు. అనేక నేతలు గతంలో అభివృద్ధి మాటలు చెప్పినప్పటికీ, వారి ప్రభావం నేడు కనపడడం లేదని పేర్కొన్నారు. బీజేపీలో విలీనం విషయంపై చేసిన వ్యాఖ్యలకు ఇప్పటివరకు స్పందించకపోవడం బాధాకరమని చెప్పారు. కులేశ్వరం ప్రాజెక్ట్‌పై బీఆర్ఎస్ నేడు చెబుతున్న వ్యాఖ్యలు వారి అనైతిక పోకడలకు నిదర్శనమని విమర్శించారు. "మీ పోరాటం నిజంగా ప్రజల కోసం అయితే, ప్రజలే నిన్ను గెలిపిస్తారు" అని వ్యాఖ్యానించారు. హరీష్ రావు ఉద్యమాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. "మీరిచ్చిన ప్రజా ప్రభుత్వం మీరు కోరుకున్న విధంగా పనిచేస్తుంటే, ఎందుకు మోకాళ్లలో కట్టె పెడుతున్నారో చెప్పాలి" అని నిలదీశారు. "మీ పాలన ప్రజలను దోచుకున్నదే, మా పాలన మాత్రం నిష్పక్షపాతంగా కొనసాగుతోంది" అన్నారు. వరదల కారణంగా ఇబ్బందులు పడుతున్న వారికి, ఇళ్లను కోల్పోయిన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరు జరుగుతోందని తెలిపారు. ఇంటి పథకాల్లో దళారులకు అవకాశం లేకుండా కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గత పదేళ్లలో అంబేద్కర్ నగర్, జితేందర్ నగర్ ప్రజలు మోసపోయిన తీరును గుర్తుచేశారు. నాయిని గారి వ్యాఖ్యలు లో ప్రజల కోసం చేయవలసిన కృషిపై స్పష్టత, ప్రభుత్వ నిబద్ధతపై ధైర్యం, రాజకీయ ప్రత్యర్థులపై ధీటైన విమర్శలు ప్రతిఫలించాయి. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ.వి. శ్రీనివాస్ రావు, సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్ యాదవ్, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జూడోలో గోల్డ్ మెడల్ సాధించిన గాజుల సహస్రకు అభినందనలు


క్రీడాకారిణికి ఆర్థిక సహాయం అందించిన మాజీ మేయర్ వై సునీల్ రావు



**కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అండర్ -17 సౌత్ ఇండియా జూడో పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన గాజుల సహస్రను మాజీ మేయర్, బీజేపీ నాయకులు వై సునీల్ రావు గారు ఘనంగా అభినందించారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్‌కు చెందిన ఈ యువ అథ్లెట్ రాష్ట్రానికి, దేశానికి పేరు తెచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గాజుల సహస్రకు భవిష్యత్తులో అవసరమయ్యే అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చిన సునీల్ రావు గారు, ప్రోత్సాహంగా ఆర్థిక సహాయాన్ని కూడా అందించారు. క్రీడారంగంలో ప్రతిభ కనబరిచిన యువతకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా వారు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఆయన అభిప్రాయపడ్డారు.

# మృతురాలి కుటుంబానికి ధూళికట్ట గ్రామ కమిటీ చేయూత

- వాట్సాప్ గ్రూప్ ద్వారా 15,500 రూపాయల ఆర్థిక సహాయం



**ఎలిగేడు, జూలై 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామానికి చెందిన దుర్గం శ్రీనివాస్ తల్లి దుర్గం పోచమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గతంలో శ్రీనివాస్ తండ్రి, భార్య మరణించడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. తల్లి అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో, గ్రామ కమిటీ వాట్సాప్ గ్రూప్ సభ్యులు స్పందించి 15,500 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. గ్రూప్ అడ్మిన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఈ విషయాన్ని పోస్ట్ చేయగానే దాతలు వెంటనే స్పందించి విరాళాలు అందించారని తెలిపారు. గతంలోనూ ఇలాంటివి ఎన్నోసార్లు నిర్వహించామని, గ్రామస్థుల సహకారంతో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మారం కొమురయ్య యాదవ్, సిహెచ్ శ్రీనివాస్, భూసారపు రమేష్ గౌడ్, దుర్గం శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# కిసాన్ నగర్‌లో పోలీసుల కార్డన్ అండ్ సెర్ ఆపరేషన్





## 71 వాహనాలు స్వాధీనం

**కరీంనగర్, జూలై 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిసాన్ నగర్‌లో జూలై 28న కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడంతో నగర ప్రజల్లో చైతన్యం వెల్లవెల్లింది. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ కార్యాచరణ చోటు చేసుకుంది. స్థానికంగా పాత నేరస్థులు అద్దెకు ఇళ్లను తీసుకుని నివసిస్తున్నారేమో అనే అనుమానాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ తనిఖీల సందర్భంగా సరైన ధృవపత్రాలు లేని వాహనాలను గుర్తించి, మొత్తం 71 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో బైకులు, ఆటోలు, ట్రాలీ ఆటో, కారు కూడా ఉన్నాయి. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలతో ప్రత్యక్షంగా సంభాషిస్తూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై విజ్ఞప్తి చేస్తూ, ఏదైనా ఆర్థిక మోసం జరిగిన వెంటనే 1930 నంబరుకు కాల్ చేయాలని తెలియజేశారు. గంటలోపే స్పందిస్తే, ఆ నష్టాన్ని తగ్గించుకోవచ్చు అని వివరించారు. ఆన్‌లైన్ లో మన వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు పంచుకోవద్దని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై సైతం అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. మాదక పదార్థాల వినియోగం, రవాణా, అమ్మకయి చట్ట పరంగా నేరమని ప్రజలకు వివరించారు. యువతను ఈ వ్యసనాల నుంచి దూరంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ రకమైన నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజల సహకారం అవసరమని అన్నారు. చట్ట వ్యతిరేకమైన ఏవైనా కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. నగరంలో శాంతి భద్రతలు కొనసాగించేందుకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

# కనిస్టేబుళ్లకు హైటెక్ శిక్షణ

## టెక్నాలజీ పరిజ్ఞానంతో ప్రజలకు మెరుగైన సేవలు



**కరీంనగర్, జూలై 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొత్తగా చేరిన కనిస్టేబుళ్లకు టెక్నాలజీపై ప్రత్యేక శిక్షణ ప్రారంభమైందని కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఐటీ కోర్ కార్యాలయంలో రెండవ బ్యాచ్ శిక్షణ సాగుతోంది. సీసీటీఎన్ఎస్ 2.0, టీఎస్- కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ- సాక్ష్య, టెక్ డాటం వంటి అప్లికేషన్లపై అవగాహన కల్పిస్తూ, సైబర్ నేరాల విచారణకు అవసరమైన ఆధునిక శిక్షణ అందిస్తున్నారు. నేరాల ఛేదనలో టెక్నాలజీ వినియోగం ద్వారా ప్రజలకు వేగవంతమైన సేవలు అందించగలమని కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు విజయకుమార్, వేణుగోపాల్, ఇన్‌స్పెక్టర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఎలిగేడు మండల టాపర్ సాహిత్యకు ఘన సన్మానం

- ఆర్డీవో చేతుల మీదుగా మెమెంటో అందజేత



**పెద్దపల్లి, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎలిగేడు మండల టాపర్‌గా నిలిచిన కోడూరి సాహిత్యను ఆదివారం ఘనంగా సన్మానించారు. పెద్దపెల్లిలోని అమర్చంద్ కళ్యాణమండపంలో జిల్లా పద్మశాలి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీవో బొద్దుల గంగయ్య ఆమెకు మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రతిభను ప్రశంసిస్తూ, విద్యారంగంలో మరింత ముందుకు సాగాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా నాయకులు వలస నీలయ్య, ఎలిగేడు మండల అధ్యక్షుడు మామిడాల రమేష్, కట్ల ప్రకాష్, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి యూఎస్‌పీసీ ఉద్యమ కార్యాచరణ

○ ఆగస్టు 1న ధర్నా - 23న మహాధర్నా



**వరంగల్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో మూడు దశల పోరాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు నన్నెబోయిన తిరుపతి పిలుపునిచ్చారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల స్టీరింగ్ కమిటీ సమావేశం స్థానిక సుబేదారి ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆయన ఉపాధ్యాయులకు ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఆగస్టు 1న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ఆగస్టు 23న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేసి ఈనెలాఖరులోగా ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అర్హతలేని డీఈఓలను వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు. డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నూతన జిల్లాలకు డీఈఓ పోస్టులు, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఈఓ, నూతన మండలాలకు ఎంఈఓ పోస్టులు మంజూరు చేయాలని, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ రూపొందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. యుటిఎఫ్ రాష్ట్ర బాధ్యులు కిరణ్ కుమార్ మాట్లాడుతూ పెన్షనర్ల బిల్లులు, వివిధ రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ప్రాథమిక పాఠశాలలకు 5571 హెచ్‌యం పోస్టులను మంజూరు చేయాలని, పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో జీఓ 2, 3, 9, 10లను రద్దు చేసి జీఓ 11, 12 ప్రకారం పదోన్నతులు కల్పించాలని కోరారు. టిపిటిఎఫ్ పూర్వ కార్యదర్శి కే.భోగేశ్వర్ మాట్లాడుతూ పైరవీ డిప్యూటేషన్లను రద్దు చేయాలని, గురుకుల టైం టేబుల్ సవరించాలని, కేజీబీవీ, మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు జీతాన్ని చెల్లించాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని, 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలలోని పండిట్, పీఈటి పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలని, ఉపాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించాలనే ఉత్తర్వులను ఉపసంహరించాలని, విద్యారంగంలో ఎన్‌జీఓ జోక్యాన్ని నివారించాలని, అన్ని జిల్లాలకు శానిటేషన్ గ్రాంట్స్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఏ.శ్రీనివాసరెడ్డి, కడారి భోగేశ్వర్, పెండం రాజు, సుజన్ ప్రసాదరావు, కట్కూరి శ్రీనివాస్, ఊటుకూరి అశోక్, జి.ఉప్పలయ్య, ఆకుల గోవిందరావు, గోడిశాల సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, రాజయ్య, డి.మహేందర్ రెడ్డి, గోవర్ధన్, జగన్మోహన్, మహేందర్ రావు, ఏ.మల్లయ్య, బి.మహేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## తపస్ సభ్యత్వ కార్యక్రమంలో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చ



**కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తపస్ సభ్యత్వ అభియాన్‌లో భాగంగా మండలంలోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ఉపాధ్యాయులపై అన్యాయంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. నగదు రహిత ఆరోగ్య కార్డులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, జిపిఎఫ్, టీఎస్‌జీఎల్ఐ వంటి పెండింగ్ బిల్లులు, డీఏలు, పీఆర్సీ అమలు అంశాల్లో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో పదివేల హెచ్‌ఎం పోస్టుల భర్తీ, తరగతికి ఒక ఉపాధ్యాయుడి నియామకం, ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అయిలవేని శ్రీనివాస్, ఆలూరి శ్రీధర్ రావు, బుర్ర నాగరాజు, చేరాల వెంకటేశ్వర్లు, సాగి గీత, విజయలక్ష్మి, మంజుల, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం నియోజకవర్గంలో గ్రామ సమస్యలపై మనాలి ఠాకూర్ పర్యటన

○ -ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ







**రామగుండం, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఆయన సతీమణి మనాలి ఠాకూర్ బసంత్‌నగర్, పాలకుర్తి మండలంలోని రామారావుపల్లి, జయ్యారం, ఎగ్లాస్పూర్ గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో మంచినీటి, రహదారి, విద్యుత్ సమస్యలపై స్థానికులతో చర్చించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులతో భేటీ అయ్యి సాగు పరిస్థితులు, పంటల ప్రగతిపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. జయ్యారం పాఠశాలలో విద్యార్థులతో సంభాషించి, మధ్యాహ్న భోజనాల నాణ్యతను పరిశీలించారు. మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ స్వయం సహాయ సంఘాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


## బండి సంజయ్ వ్యాఖ్యలపై సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి ఫైర్

బీసీల రిజర్వేషన్ బిల్లుపై కేంద్రం మౌనం దారుణం



**కరీంనగర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతుంటే, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పార్లమెంట్‌లో బిల్లు పెట్టకుండా తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. బీసీ సంఘాల మద్దతుతో ఎంపీగా గెలిచిన బండి సంజయ్, ఇప్పుడు అదే సంఘాలను తప్పుబడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా శ్రేయస్సు కోసం కృషి చేస్తుంటే, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చౌకబారు విమర్శలు చేస్తూ వార్తల్లో ఉండాలని చూస్తున్నారని నరేందర్ రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీల హక్కుల కోసం పోరాడుతుందని, ప్రధాని మోడీ కులాన్ని బీసీలలో చేర్చిన ఘనత కూడా కాంగ్రెస్‌దేనని గుర్తుచేశారు. ఈ విలేకరుల సమావేశంలో కొరివి అరుణ్ కుమార్, బానోతు శ్రవణ్ నాయక్, సమద్ నవాబ్, దండి రవీందర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కీర్తి కుమార్, పెద్దిగారి తిరుపతి, అస్తపురం రమేష్, నెల్లి నరేష్, మిరాజ్, కొట్టె ప్రభాకర్, మాసుం ఖాన్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ లో చిరుత సంచారం.. సీసీ కెమెరాల్లో రోడ్డు దాటుతున్న దృశ్యాలు



**హైదరాబాద్,జులై 28 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
నగరంలో చిరుత సంచారం కలకలం రేపింది. గోల్కొండలోని ఇబ్రహీంబాగ్ మిలిటరీ ప్రాంతంలో రోడ్డు దాటుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. తారామతి వెనుకభాగం మూసీ వైపు చిరుత వెళ్లినట్లు సమాచారం. చిరుత సంచారంపై అటవీశాఖ అధికారులకు గోల్కొండ పోలీసులు సమాచారం ఇచ్చారు. కొన్ని రోజులుగా మంచిరేవుల, నార్సింగి ప్రాంతాల్లో చిరుత సంచరిస్తోంది. గ్రేహౌండ్స్ ప్రాంతంలో 4 బోన్లు, ట్రాప్ కెమెరాలను అధికారులు ఏర్పాటు చేశారు. బోన్లకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతోంది. ఈ క్రమంలోనే ఇబ్రహీంబాగ్ మిలిటరీ ప్రాంతంలో చిరుత రోడ్డుదాటినట్లు సమాచారం.

## బాధితున్ని పరామర్శించిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



**వంగూర్ ,జూలై 28( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వంగూర్ మండల పరిధిలోని చింతపల్లి గ్రామానికి చెందిన సాయి కుమార్ నిన్న ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ కు గురై వెల్దండ లోని యేన్నమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతూన్న విషయాన్ని కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకొని. సోమవారం హాస్పిటల్ కు వచ్చి వారిని పరామర్శించిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, అనంతరం అక్కడి వైద్యులకు వైద్య లకు సలహా సూచనలు ఇవ్వడం జరిగింది.

## కేజీబీవీల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగర్ కర్నూల్ జిల్లాలో 20 విద్యాలయాల్లో ఖాళీ సీట్లు

**నాగర్ కర్నూల్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
2025 -26 విద్యా సంవత్సరానికి గాను నాగర్ కర్నూల్ జిల్లాలోని 20 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంపిహెచ్‌డబ్ల్యు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 30లోగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ తెలిపారు. ప్రవేశం కోరే బాలికలు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆయా కేజీబీవీ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేయాలని సూచించారు. విద్యాలయాల్లో నాణ్యమైన భోజనం, వసతి, స్మార్ట్ తరగతులు, మెరుగైన విద్యా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## గత బీఆర్‌ఎస్ పాలనపై ఎమ్మెల్యే కవ్వంపల్లి ఘాటు విమర్శ


ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ, అభివృద్ధి పనుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ముందంజ



**మానకొండూర్, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గత బీఆర్‌ఎస్ పాలకులు ప్రభుత్వ ధనాన్ని దుబారా చేసి, ఆర్థిక భారం సాకుతో సంక్షేమ పథకాలకు దూరమయ్యారని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. బెజ్జంకి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేసిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి పథకం అమలుతో పాటు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ కొనసాగుతోందని పేర్కొన్నారు. అలాగే, రూ.7.5 లక్షలతో భవిత కేంద్రం, రూ.8 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం, రూ.20 లక్షలతో పంచాయతీ భవనాలు, రూ.62.5 లక్షలతో సీసీ రోడ్డు, వాటర్ ట్యాంక్ నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఎల్‌ఎండి కాలనీలో 12 మందికి ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేశారు. "పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఏమీ చేయలేదు. ఇప్పుడు మేము నిరుపేదల ఇంటి కలను సాకారం చేస్తున్నాం," అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## "బచ్చా గానివి.. నీ పద్ధతి మార్చుకో"

○ కేటీఆర్‌పై ఎమ్మెల్యే గండ్ర ఘాటు విమర్శలు



**భూపాలపల్లి, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బీఆర్‌ఎస్ నేత కేటీఆర్‌పై భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "కేటీఆర్ నువ్వో బచ్చా గానివి.. రాజకీయ అవగాహన లేకుండా మా ప్రభుత్వాన్ని దున్నపోతు ప్రభుత్వమంటావా?" అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, వేలాది ఎకరాల భూములు కొల్లగొట్టి లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం వంటి హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. "నువ్వు వ్యాపారాలే లేవన్నావు, త్వరలోనే నీ విదేశీ వ్యాపారాల చిట్టా బయటపెడతా" అని హెచ్చరించారు. కాంగ్రెస్ నేతలపై బీఆర్‌ఎస్ హయాంలో అక్రమ కేసులు పెట్టారని గుర్తుచేశారు. "18 నెలల్లోనే అభివృద్ధి చేసి చూపించాను, పనులు పూర్తికాకపోతే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను" అని స్పష్టం చేశారు. కేటీఆర్, బీఆర్‌ఎస్ నేతలు తప్పుడు మాటలు మానుకోవాలని సూచించిన ఎమ్మెల్యే, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు మరోసారి గుణపాఠం చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రావు



లింగాల,జులై 28( నీలగిరి ఎక్స్‌ప్రెస్) తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ , ఆదేశాల మేరకు,లింగాల మండలం ఎంసి తండా గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కిషన్ నాయక్, గత నాలుగు రోజుల క్రితం ప్రమాదవశాత్తు రోడ్డు మార్గంలో మరణించడం జరిగింది. కార్యకర్తల ద్వారా విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ,కుటుంబ సభ్యులను పరామర్శించి , మనోధైర్యం ఇవ్వడం జరిగింది. అనంతరం ఆర్థిక సహాయం అందిస్తూ,ఎమ్మెల్యే డా . చిక్కుడు వంశీకృష్ణతో మాట్లాడి ప్రభుత్వ పరంగా అండగా నిలిచి కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపిన. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రంగినేని శ్రీనివాస్ రావు,ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల పార్టీ అధ్యక్షులు కొత్త నాగేశ్వరరావు , అచ్చంపేట మార్కెట్ డైరెక్టర్ ముక్తార్,లింగాల పట్టణ అధ్యక్షులు పూజారి వెంకటయ్య, గ్రామ నాయకులు నిరంజన్ నాయక్ , పరిమేష్, అప్పాయిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రవీందర్, సురేందర్ రావు, శ్రీనివాస్ రావు,శశిధర్, బాలరాజు, రవి, వెంకటేష్ నాయక్, హరితేజ గౌడ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి వర్ధంతి సభలో పాల్గొన్న టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ వంశీకృష్ణ



వెల్దండ,జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) వెల్దండ మండల పరిధిలోని కోట్ర చౌరస్తా లో మాజీ కేంద్ర మంత్రి,స్వర్గీయ సూదిని జైపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా కొట్ర చౌరస్తాలోని జైపాల్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు టీపీసీసీ ఉపాధ్యక్షులు ,అచ్చంపేట ఎమ్మెల్యే డా,చిక్కుడు వంశీకృష్ణ, ఈ కార్యక్రమంలో కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మోతీలాల్ నాయక్,తాలుకా కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి,యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి తక్కళ్ళపల్లి శేఖర్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర గిరిజన నాయకులు శంకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్,ముదిగొండ రమేష్, కొయ్యల పుల్లయ్య, కాడురాం నాయక్,చంద్ నాయక్,వెంకటయ్య,బ్రహ్మాచారి,తదితరులు పాల్గొన్నారు.

## మాడుగుల మండలంలో యూరియా సరిపడా అందుబాటులో ఉంది

-రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయ శాఖ సూచన



మాడుగుల, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) మాడుగుల మండలంలో రైతులకు అవసరమైన యూరియా సరిపడా అందుబాటులో ఉందని వ్యవసాయ అధికారి అరుణకుమారి తెలిపారు. పిఎసిఎస్, పిర్ యుస్, ప్రైవేట్ డీలర్ల ద్వారా మొత్తం 151.935 టన్నుల యూరియా నిల్వలో ఉందని పేర్కొన్నారు. రైతులు యూరియా కొరతపై అవాస్తవ ప్రచారాలను నమ్మకుండా, మండలంలోని వివిధ ట్రేడర్స్ వద్ద అందుబాటులో ఉన్న యూరియాను వినియోగించుకోవాలని ఆమె సూచించారు. అవసరమైనంత యూరియా నిల్వలో ఉండటంతో, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది.

## ఎలిగేడు డిప్యూటీ తహసిల్దార్ బదిలీ కిరణ్ కుమార్‌కు ఘన సన్మానం



ఎలిగేడు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) ఎలిగేడు మండల డిప్యూటీ తహసిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కిరణ్ కుమార్ మంథనికి బదిలీ కాగా, మంథనిలో పనిచేస్తున్న గిరి ఎలిగేడుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ యాకన్న, ఆర్ఐలు చంద్రశేఖర్, జయలక్ష్మి, కార్యాలయ సిబ్బంది, మాజీ ఎంపీపీ కవ్వంపల్లి లక్ష్మీ దుర్గయ్యలు కిరణ్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

# ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై యు.ఎస్.పి.సి ఆధ్వర్యంలో జిల్లాలో జరిగే ధర్నాను విజయవంతం చేయండి..

-యు.ఎస్.పి.సి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు చకినాల అనిల్ కుమార్...






కామారెడ్డి, జూలై 28(నీలగిరి ఎక్స్ ప్రెస్): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో రెండవ దశ పోరాట కార్యక్రమం జిల్లా కేంద్రాలలో జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూఎస్పిసి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు చకినాల అనిల్ కుమార్, పిలుపునిచ్చారు స్థానిక కర్షక్ బిఈడి కళాశాల ఆవరణలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే ధర్నా కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే దశలవారీ పోరాటం విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఆగస్టు 23న హైదరాబాద్ లో రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లు బదిలీల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేసి, ఈనెలాఖరులోగా ప్రక్రియను పూర్తి చేయాలని, అర్హతలేని డీఈఓ లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. నూతన జిల్లాలకు డిఈఓ పోస్టులను, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఈఓ, నూతన మండలాలకు యంఈఓ పోస్టులను మంజూరు చేసి, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్‌ను రూపొందించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయలని, ఉపాధ్యాయుల పెన్షనర్ల, వివిధ రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ప్రాథమిక పాఠశాలలకు 5571 పియస్ హెచ్‌యం పోస్టులను మంజూరు చేయాలని, పండిట్, పిఈటిల అప్ గ్రేడేషన్ ప్రక్రియ పూర్తి అయినందున జిఓ 2,3,9,10 లను రద్దు చేసి జిఓ 11,12 ల ప్రకారం పదోన్నతులు కల్పించాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు మార్గదర్శకాలను సవరించాలని, వివిధ జిల్లాల్లో జరిగిన పైరవీ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని, గురుకుల టైం టేబుల్ సవరించాలని, కెజిబివి, మోడల్ స్కూల్స్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు జీతాన్ని వెంటనే చెల్లించాలని, కేజిబివి, యూ ఆర్ ఎస్, సమగ్ర శిక్ష, కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని, మోడల్ స్కూల్, గురుకుల సిబ్బందికి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలలోని పండిట్, పిఇటి పోస్టులను అప్ గ్రేడ్ చేసి వెంటనే పదోన్నతులు ఇవ్వాలని, ఉపాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించాలనే ఉత్తర్వులను ఉపసంహరించాలని, విద్యారంగంలో ఎన్ జి ఓ జోక్యాన్ని నివరించాలని, అన్ని జిల్లాలకు శానిటేషన్ గ్రాంట్స్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కామారెడ్డి జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ స్టీరింగ్ కమిటీ నాయకులు టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు చింతల లింగం, టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుల బాబు, డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్సీ ప్రభాకర్ టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు నళిని, శ్యాం కుమార్, నారాయణ వంశీధర్ ప్రకాష్ లక్ష్మి, రాజ్ కుమార్ శ్యాం కుమార్ రూప్ సింగ్, ఏసురత్నం, సాయి మొదలగు వారు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇంటిని ముట్టడించిన ఫార్మా బాధిత రైతులు





హైదరాబాద్,జులై 28 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ) ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ఇంటిని ఫార్మా బాధిత రైతులు సోమవారం ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ముట్టడించారు. యాచారం మండలంలోని మేటిపల్లి నానక్ నగర్ తాటిపర్తి కురుమిద్ద గ్రామాలకు చెందిన ఫార్మా బాధిత రైతులు ఉదయం తెల్లవారుజామునే కృయిజర్లు, ట్రాక్టర్లు కట్టుకొని తిరుమలహిల్స్‌లోని ఎమ్మెల్యే రంగారెడ్డి ఇంటికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. రంగారెడ్డి ఇంటి ముందు సుమారు 300 మంది రైతులు, మహిళలు, యువకులు బైఠాయించి ప్లకార్డులను ప్రదర్శించి నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి, ఎమ్మెల్యే రంగారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చే వరకు అక్కడి నుంచి కదిలేది లేదంటూ రైతులు భీష్మించి కూర్చున్నారు. ఈ సందర్భంగా ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ సమన్వయకర్త కవుల సరస్వతి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఫార్మా బాధిత రైతులకు ఎమ్మెల్యే రంగారెడ్డి ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని ఫార్మా బాధిత రైతులకు భూములను తిరిగి ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న నేటికీ హామీ నెరవేర్చక పోవడం ఎంతవరకు సమంజసం అని ఆమె ప్రశ్నించారు. ఫార్మాసిటీ పై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఫార్మా కు ఇవ్వని 2500 ఎకరాల భూమిని తిరిగి రైతుల పేరిట ఆన్లైన్లో నమోదు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. నిషేధిత జాబితా నుండి ఇట్టి భూములను వెంటనే తొలగించాలని కోరారు. రైతులకు రైతు భరోసా, రైతు భీమా, పంట రుణం, రుణమాఫీ, రైతులు భూమిని అమ్ముకునేందుకు వీలుగా రిజిస్ట్రేషన్ అయ్యేలా వసతి కల్పించాలని ఆమె కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు రైతులతో కలిసి పాదయాత్ర చేసిన మంత్రులు సీతక్క భట్టి విక్రమార్క కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎమ్మెల్సీలు కోదండరాం తీన్మార్ మల్లన్న ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిలు నేడు పార్టీ అధికారంలోకి వచ్చి వారికి పదవులు రాగానే ఫార్మా రైతులను పూర్తిగా విస్మరించాలని ఆమె మండిపడ్డారు. ఇకపై రైతులతో పాదయాత్ర చేసి రైతులను విస్మరించిన ప్రతి నాయకుడిని ఇంటిని ముట్టడించి నిలదీస్తామని ఆమె స్పష్టం చేశారు. అయినప్పటికీ రైతులకు న్యాయం జరగకపోతే ఇక ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కానమోని గణేష్, సామ నిరంజన్, కుందారపు నారాయణ, పాపి రెడ్డి, చెన్నయ్య, సందీప్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీకాంత్, రాజశేఖర్ రెడ్డి, రైతులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## లబ్దిదారులకు రేషన్ కార్డులను పంపిణీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



అచ్చంపేట,జూలై 28 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) అచ్చంపేట పట్టణ కేంద్రంలోఎమ్మెల్యే వంశీకృష్ణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు పంపిణీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వము చేపట్టిన,రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వము పది సంవత్సరాలలో ఏ ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదు బిఆర్ఎస్ ప్రభుత్వం ఉప ఎన్నికలు వస్తేనే రేషన్ కార్డులు పంపించేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతాయి అని ప్రజలకు వివరించారు. మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగింది. కార్యక్రమంలో భాగం,గాసోమవారం అచ్చంపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేసిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ,కేసీఆర్ కు అధికారం అప్పగిస్తే బతుకులు బాగుపడతాయి అని భావించి రెండుసార్లు గెలిపించినారు. రెండు సార్లు అధికారంలో ఉన్న కేసీఆర్, ఆయన హయాంలో మంత్రులు, ఎమ్మెల్యేలుగా ఉన్నవారు కట్టు కథలతో కాలయాపన చేశారు. తప్ప అభివృద్ధి శూన్యం అన్నారు. ఎన్నికలకు ముందు వారికున్న ఆస్తులుఅమాంతం పెంచుకున్నారు తప్ప. ప్రజలకు ఉపయోగపడే ఒక్క రేషన్ కార్డుకూడా,ఇవ్వలేకపోయారు అని ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఎన్నికల హామీల్లో భాగంగా 6 గ్యారంటీలను ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తుంది. అదేవిధంగా రైతులందరికీ రుణమాఫీ, ఇందిరమ్మ ఇల్లు , రైతు భరోసా రైతు బీమా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం ఎన్నో సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మాధవి మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, సివిల్ సప్లై శాఖ అధికారులు రెవెన్యూ అధికారులు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ,నాయకులు కార్యకర్తలు రేషన్ కార్డుల లబ్ధిదారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

## కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కడ్తాల్, జూలై 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెరవేర్చారని ప్రజా ప్రభుత్వాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కడ్తాల్ మండల కేంద్రంలో ఎంబీఏ గార్డెన్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నూతన రేషన్ కార్డులను తహసిల్దార్, ముంతాజ్ బేగం, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే రేషన్ వినియోగదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ గత తొమ్మిది ఏళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు మంజూరు చేయకపోవడం వల్ల ఎంతో మంది ఇబ్బందులకు గురయ్యారన్నారు. వారికి ప్రభుత్వ పథకాలు అందకుండా పోయాయన్నారు. ఈ రేషన్ కార్డు పంపిణీ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని ఎవరు ఆందోళన చెందవద్దని అర్హులైన వారందరికీ వస్తాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అభయహస్తం, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి లాంటి అనేక పథకాలు అమలు చేయడం జరిగిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలను మంజూరు చేసి సిసి రోడ్లు, బిటి రోడ్లు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. అన్ని వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యను అభ్యసించేందు కోసం యంగ్ ఇండియన్ పాఠశాలను మంజూరు చేయించి తలకొండపల్లి మండలంలోని ఖానాపూర్ సమీపంలో 25 ఎకరాలలో రూ. రెండు వందల కోట్లతో నిర్మించడం కోసం ప్రభుత్వం టెండర్లు పిలవడం జరిగిందని తెలిపారు. ఇంకా అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఇందిరమ్మ ప్రజా పాలన కొనసాగుతుందని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో టి పిసిసి అధికార ప్రతినిధి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు బాలాజీ సింగ్, టి పిసిసి సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నరసింహ, వైస్ చైర్మన్ గుడురు భాస్కర్ రెడ్డి, ఎంపీడీవో సుజాత రెవెన్యూ అధికారులు, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రవి గౌడ్, నరేష్, జహంగీర్, బిక్య నాయక్ , బిచ్చ నాయక్, మాజీ సర్పంచ్లు, రేషన్ డీలర్లు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ముహమ్మద్ ఖాజా క్కుతుబుద్దీన్ మృతి





**యాచారం,జూలై 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మేడిపల్లి గ్రామానికి చెందిన ముహమ్మద్ ఖాజా క్కుతుబుద్దీన్ ( హైదర్) హైదరాబాద్.. ప్రో. టైటాన్ షోరూం 27 తేది సాయంత్రం సమయంలో మృతి చెందారు. ఆయన మృతదేహానికి వారి మిత్రులు 10వ తరగతి ( 1990) చదువుతున్న విద్యార్థులు తలారి మల్లేష్, కందుకూరి రామచంద్రయ్య, శ్రీనివాస్ చారి , జంగయ్య, కందికొండ భాస్కర్, బండారి హరికిషన్. మరియు పీఆర్జీ ఫౌండేషన్ అధ్యక్షులు ప్రొద్దుటూరు రవీందర్ గుప్తా తదితరులు..., పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తుచేసుకొని శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తూ ప్రార్థి ప్రార్థించారు.. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు వికసిత్ భారత్ రోజ్గార్ యోజన పై స్పష్టత

**వనపర్తి,జూలై 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ( ఈపీఎఫ్ఓ ) రంగారెడ్డి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిధి ఆప్కే నికట్ కార్యక్రమం కింద వనపర్తిలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి ఎన్ఫోర్స్మెంట్ అధికారి శ్రీ ఏ. ప్రసాద్ కుమార్లు పాల్గొని, కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్గార్ యోజన (పీఎం – వివిఆర్ఓ వై ) పై విపులంగా వివరించారు. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా ఉత్పాదక రంగంతో పాటు ఇతర రంగాల్లో 3.5 కోట్ల కొత్త ఉద్యోగాల రూపకల్పన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించింది. రూ. లక్ష కోట్ల వ్యయంతో అమలవుతున్న ఈ పథకం 2025 ఆగస్టు 1 నుండి 2027 జూలై 31 వరకు మధ్యకాలంలో కల్పించిన ఉద్యోగాలకు వర్తించనుంది.

**ఈ పథకం రెండు భాగాలుగా ఉంటుంది:**




భాగం ఏ – తొలిసారిగా ఉద్యోగంలో చేరినవారికి: ఈపీఎఫ్ఓలో మొదటిసారిగా నమోదు అయిన ఉద్యోగులకు రూ. 15,000 వరకు వేతనంపై రెండు విడతలుగా ఆర్థిక సహాయం అందించనున్నారు. మొదటి విడతను 6 నెలల సేవ అనంతరం, రెండవ విడతను 12 నెలల సేవ తర్వాత ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం పూర్తిచేసిన తర్వాత చెల్లించనున్నారు. రూ. లక్ష వరకు వేతనం ఉన్నవారు అర్హులు.

**భాగం బీ – యాజమాన్యాల ప్రోత్సాహనకు:**
తయారీ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యతతో, కనీసం 6 నెలల పాటు ఉద్యోగులను నియమించిన యాజమాన్యాలకు ప్రతి అదనపు ఉద్యోగిపై నెలకు రూ. 3,000 వరకూ ప్రోత్సాహకాలు రెండు సంవత్సరాలు అందించనున్నారు.

50 కంటే తక్కువ ఉద్యోగులు ఉన్న యాజమాన్యాలు కనీసం ఇద్దరునీ 50 లేదా అంతకంటే ఎక్కువ ఉద్యోగులు ఉన్న యాజమాన్యాలు కనీసం 5 మందిని అదనంగా నియమించాల్సి ఉంటుంది. ఈ సమావేశంలో ఉద్యోగులు, యాజమాన్యాల సందేహాలను నివృత్తి చేయడంతోపాటు, ఈపీఎఫ్ఓ పథకాల లబ్ధిదారులకు వివరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి శ్రీ ఏ. ప్రసాద్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీ పి. అనిల్ కుమార్, ప్రైవేటు విద్యాసంస్థల పట్టణ అధ్యక్షులు గౌతమ్ కుమార్ గుప్తా , ప్రభుత్వ సంస్థలకు చెందిన ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులందరికీ కార్డులు అందిస్తాం: ఎమ్మెల్యే కసిరెడ్డి

## ఆమనగల్లులో 2038 రేషన్ కార్డుల పంపిణీ



**ఆమనగల్లు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లు మండల కేంద్రంలోని రైతు వేదికలో 2038 రేషన్ కార్డులు (508 నూతన, 1530 పేర్లు చేర్పు) లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తామని హామీ ఇచ్చారు.రేషన్ కార్డుల ద్వారా పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కేఎల్ఐ ఢీ%-%82 కాల్వ ద్వారా చివరి ఆయకట్టు వరకు మూడు రోజుల్లో నీరు అందుతుందని పేర్కొన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు, రైతులకు యూరియా నిల్వలు, 2 లక్షల రుణమాఫీ, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి 10 కోట్లు కేటాయించామని, మరో 10 కోట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీబీ సభ్యుడు బాలాజీ సింగ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు .

# వన మహోత్సవ లక్ష్యాలను సాధించాలి.

## జిల్లా కలెక్టర్ శ్రీ ఆదర్శ్ సురభి.

**వనపర్తి,జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమం లక్ష్యాలను సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వన మహోత్సవం కార్యక్రమానికి సంబంధించి సాధించాల్సిన లక్ష్యాలపై కలెక్టర్ జిల్లా అటవీ శాఖ అధికారి అరవింద్ ప్రసాద్ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమం లక్ష్యాలను సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు కృషి



చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది మన జిల్లాకు 21 లక్షల మొక్కలు నాటడం లక్ష్యమని ఆ లక్ష్యాన్ని 100% సాధించే దిశగా ముందుకు వెళ్లాలన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని కాపాడడం కూడా అందరి బాధ్యత అని గుర్తు చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో వారికి వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలల ఆవరణల్లో వనమహోత్సవం కార్యక్రమాన్ని పండగల నిర్వహించాలన్నారు. ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ వారంలో తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి ఆ తర్వాత మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో 41 శాతం లక్ష్యాలను సాధించినట్లు చెప్పారు. ఇంకా వన మహోత్సవం లో భాగంగా మరిన్ని మొక్కలు నాటి లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, అన్ని జిల్లా శాఖల అధికారులు, ఇతర అధికారులు తదితరులుపాల్గొన్నారు.

# బీసీల రిజర్వేషన్ల అమలులో కాంగ్రెస్ కు చిత్తశుద్ధి లేదు...

## ఎంపీ వద్దిరాజు ధ్వజం...



**హైదరాబాద్, జూలై 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని మరోసారి తేలిపోయిందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. కామారెడ్డి బహిరంగ సభలో స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా, ఉద్యోగ రంగాలలో 42% రిజర్వేషన్లు అమలు చేస్తామని, ఎన్నికల మేనిఫెస్టోలో 432 హామీలిచ్చి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లతో కాంగ్రెస్ అధికారం చేపట్టిందన్నారు. ఎన్నికల సమయంలో అలవికాని హామీలిచ్చి, తీరా అధికారం చేపట్టాక అమలు చేయడం ఇష్టం లేక డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నదని అధికారపక్షంపై ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో మండిపడ్డారు.ప్రజలకిచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికలలో, విద్యా, ఉద్యోగ రంగాలలో 42% రిజర్వేషన్స్ అమలు చేయాల్సిందేనని, ఇందుకోసం తమ పార్టీ పోరాడుతూనే ఉంటుందన్నారు. రిజర్వేషన్ల అమలునకు అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధాని నరేంద్ర మోడీని కలిసి మరింత వత్తిడి పెంచి పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టించి ఆమోదింపజేయాలని, ఇందుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతునిస్తుందని ఎంపీ రవిచంద్ర చెప్పారు.


# మెట్ పల్లి క్లబ్ అక్రమ రిజిస్ట్రేషన్ ను రద్దు చేయాలి

**మెట్ పల్లి జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మెట్ పల్లి క్లబ్ శాశ్వత సభ్యుల వారసులు మెట్ పల్లి సబ్ రిజిస్టర్ ఆఫీసర్ ను సోమవారం కలిసి మెట్ పల్లి క్లబ్ అక్రమ రిజిస్ట్రేషన్ ను రద్దు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేసారు. అనంతరం వారు మాట్లాడుతూ మెట్ పల్లి క్లబ్ అక్రమంగా రిజిస్ట్రేషన్ జరిగిందని శాశ్వత సభ్యుల వారసులమైన మాకు తీవ్ర అన్యాయం జరిగిందని శాశ్వత సభ్యులుగా ఉన్న మా కుటుంబ సభ్యులకు తెలపకుండా ఇష్టానుసారంగా క్లబ్ ను రిజిస్ట్రేషన్ చేసిన దానిని రద్దు చేసి మాకు న్యాయం చేయాలని అలాగే పోలీస్ స్టేషన్లో ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తమకు న్యాయం చేయాలని కోరడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో బర్ల అర్జున్, ధర్మపురి నందు, సుధీర్, పవన్, జయప్రకాష్ , దొంతుల వెంకటేశ్వర్లు, అలకట్టు మణిదీప్, తదితరులు పాల్గొన్నారు.



# బిజినెస్

## సూచీలకు భారీ నష్టాలు.. 570 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్..




విదేశీ మదుపర్లు అమ్మకాలకు పాల్పడుతుండడం, అంతర్జాతీయ మార్కెట్ల నష్టాలు దేశీయ సూచీలపై తీవ్ర ప్రభావం చూపించాయి. గత శుక్రవారం విదేశీ మదుపర్లు 1976 కోట్ల రూపాయల విలువైన షేర్లను విక్రయించడం నెగిటివ్‌గా మారింది. అమెరికా–భారత్ ట్రేడ్ డీల్ ఆలస్యం అవుతుండడం కూడా మదుపర్లను కలవరపెడుతోంది. అలాగే పలు కంపెనీలు వెలువరిస్తున్న త్రైమాసిక ఫలితాల నిరాశజనకంగా ఉండడంతో సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి.గత శుక్రవారం ముగింపు (81, 463)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం నష్టాలతో మొదలైన సెన్సెక్స్ ఉదయం కాసేపు లాభనష్టాలతో దోబూచులాడింది. అయితే మధ్యాహ్నం తర్వాత మదుపర్లు అమ్మకాలకు దిగడంతో సెన్సెక్స్ కోలుకోలేదు. చివరకు సెన్సెక్స్ 572 పాయింట్ల నష్టంతో 80, 891 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే నడించింది. చివరకు 156 పాయింట్ల నష్టంతో 24, 680 వద్ద రోజును ముగించింది.సెన్సెక్స్‌లో లారస్ ల్యాబ్స్, ఎంపసిస్, అదానీ గ్రీన్ ఎనర్జీ, శ్రీరామ్ ఫైనాన్స్, అంబర్ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు లాభాలు ఆర్జించాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, లోథా డెవలపర్స్, ఎస్బీఐ కార్డ్, సీడీఎస్ఎల్, గోద్రేజ్ ప్రాపర్టీస్ షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 490 పాయింట్లు నష్టపోయింది. బ్యాంక్ నిఫ్టీ 444 పాయింట్లు కోల్పోయింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 86.67గా ఉంది.

## తగ్గుతున్న బంగారం ధరలు.. హైదరాబాద్‌లో తులం ధర ఎంతంటే..



బంగారం ధరలు తగ్గుతున్నప్పటికీ ఇంకా అల్ టైమ్ రికార్డులోనే ఉంది. ఎందుకంటే తులం బంగారాన్ని కొనుగోలు చేయాలంటే లక్ష రూపాయల వరకు ఉంది. ప్రస్తుతం స్వల్పంగా తగ్గినప్పటికీ ధర భారీగానే ఉంది. తాజాగా జూలై 28వ తేదీన దేశీయంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 99,920 రూపాయలు ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర 91,590 రూపాయల వద్ద ఉంది. ఇక వెండి విషయానికొస్తే ఇది కూడా స్వల్పంగా తగ్గింది. కిలో వెండి ధర లక్షా 15,900 రూపాయల వద్ద ఉంది. కొన్ని ప్రాంతాల్లో లక్షా 25,900 వద్ద కొనసాగుతోంది.

చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 99,920 రూపాయలు, 22 క్యారెట్ల ధర 91,590 రూపాయల వద్ద ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 10,007 రూపాయలు, 22 క్యారెట్ల ధర 91,740 రూపాయల వద్ద ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 99,920 రూపాయలు, 22 క్యారెట్ల ధర 91,590 రూపాయల వద్ద ఉంది.

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 99,920 రూపాయలు, 22 క్యారెట్ల ధర 91,590 రూపాయల వద్ద ఉంది.

విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 99,920 రూపాయలు, 22 క్యారెట్ల ధర 91,590 రూపాయల వద్ద ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 99,920 రూపాయలు, 22 క్యారెట్ల ధర 91,590 రూపాయల వద్ద ఉంది.

## కేవలం రూ. 40 వేలతో ఎలక్ట్రిక్ కారు మీ సొంతం.. 315 కిమీ మైలేజ్.. ఎలాగంటారా.?




దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల డిమాండ్ గణనీయంగా పెరిగిపోయింది. కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు పెట్రోల్, డీజిల్ వాహనాలను తగ్గించడంలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలపై ప్రభుత్వాలు సైతం ప్రత్యేక రాయితీలు అందిస్తున్నాయ్. దీంతో పెట్రోల్, డీజిల్ వాహనాల నుంచి ట్రెండ్ కాస్తా ఎలక్ట్రిక్, CNG వాహనాల వైపునకు మారింది. దానికి తగ్గట్టుగానే ప్రముఖ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్ ప్రత్యేకమైన ఫీచర్లతో పూర్తిస్థాయి ఈవీ వాహనాలను మార్కెట్‌లోకి విడుదల చేసింది. అందులో ఒకటి టాటా పంచ్ ఈవీ.ఈ కారు ప్రారంభ మోడల్ ఆన్–రోడ్ ధర రూ. 10.45 లక్షలు ఉండగా.. దీన్ని మీరు కేవలం రూ. 40 వేల డౌన్ పేమెంట్‌తో సొంతం చేసుకోవచ్చు. మిగతాది ప్రతీ నెలా రూ. 25 వేల వరకు ఈఎంఐ కింద కట్టుకోవచ్చు. అయితే ఈ మొత్తం వివిధ రాష్ట్రాలు, ఫైనాన్స్‌లపై ఆధారపడి ఉంటుంది. అలాగే లోన్‌కి మీ క్రెడిట్ స్కోర్ కూడా కీలకం అవుతుంది. ఇక ఈ కారు ఫీచర్ల విషయానికొస్తే.. ఇందులో 25 kWh లిథియం అయాన్ బ్యాటరీ ప్యాక్ ఉండగా.. దీన్ని ఒకసారి ఛార్జ్ చేస్తే ఏకంగా 315 కి.మీ వరకు మైలేజ్ ఇస్తుంది. అలాగే ఈ కారు 100 కి.మీ వేగాన్ని కేవలం 9.5 సెకన్లలో అందుకుంటుంది. అలాగే గరిష్టంగా గంటకు 140 కి.మీ వేగంతో వెళ్తుంది. అలాగే ఈ కారు బ్యాటరీని చాలా సులభంగా చార్జ్ చేయవచ్చు.ఈ ఎస్‌యూవీలో 366 లీటర్ల బూట్ స్పేస్ ఉంది. అలాగే పవర్ స్టీరింగ్, యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, డ్రైవర్ ఎయిర్ బ్యాగ్, ఆటోమెటిక్ క్లైమేట్ కంట్రోల్, పాసింజర్ ఎయిర్ బ్యాగ్ వంటి సెక్యూరిటీ ఫీచర్లు ఈ టాటా పంచ్ SUV లో ఉన్నాయి. అటు ఈ కారుకు అలాయ్ వీల్స్ అమర్చారు.

## 2980 బంతులు వేసిన బుమ్రా.. క్లారిటీ ఇవ్వని గంభీర్.. 5టెస్ట్ ఆడతాడా ?




మాంచెస్టర్ టెస్ట్ ముగిసింది. భారత్, ఇంగ్లాండ్ మధ్య నాలుగో టెస్ట్ డ్రాగా ముగిసింది. ఇప్పుడు మరో ప్రశ్న తెరమీదకు వచ్చింది. అదే జస్‌ప్రీత్ బుమ్రా ఐదవ టెస్ట్ ఆడతాడా? లేదా ? జస్‌ప్రీత్ బుమ్రా ఇంగ్లాండ్ పర్యటనలో కేవలం 3 టెస్టులు మాత్రమే ఆడతాడని గతంలో వార్తలు వచ్చాయి. బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్ట్ నుంచి అతనికి విశ్రాంతి ఇవ్వడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. అయితే, ఆ తర్వాత జట్టు అవసరాలను బట్టి లార్డ్స్‌లో జరిగిన మూడో టెస్ట్‌లో, మాంచెస్టర్‌లో జరిగిన నాలుగో టెస్ట్‌లో కూడా అతను ఆడాడు. టీమిండియాకు ఐదవ టెస్ట్ కూడా చాలా కీలకం కానుంది. అయితే, బుమ్రా ఈ మ్యాచ్‌లో ఆడకపోతే, అతను ఇంగ్లాండ్ పర్యటనలో 3 కాకుండా 4 టెస్టులు ఆడినట్లు అవుతుంది. ఈ కారణంగానే మాంచెస్టర్ టెస్ట్ తర్వాత బుమ్రా విశ్రాంతిపై ప్రెస్ కాన్ఫరెన్స్‌లో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రశ్నలు ఎదురయ్యాయి.గౌతమ్ గంభీర్ కూడా బుమ్రా విశ్రాంతిపై అడిగిన ప్రశ్నకు తనదైన శైలిలో సమాధానం ఇచ్చాడు. ఓవల్ టెస్ట్ ప్లేయింగ్ ఎలెవన్ నుంచి బుమ్రా తప్పుకుంటాడని స్పష్టం చేయలేదు. ఆ ప్రశ్నను గంభీర్ దాటేశాడు. మరి టీమిండియా హెడ్ కోచ్ తన స్టార్ పేసర్‌పై మాట్లాడుతూ.. బుమ్రా విశ్రాంతిపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని అన్నారు. ఆ విషయంపై లీడ్స్ చేరుకున్న తర్వాతనే ఓ నిర్ణయానికి వస్తామన్నారు. అంటే, బుమ్రా ఐదవ టెస్ట్ ఆడతాడా లేదా అనే విషయంపై ప్రస్తుతానికి స్పష్టత లేదు.అయితే, బుమ్రాకు ఎందుకు విశ్రాంతి కావాలి అనే ప్రశ్న కొందరిలో ఉంది. అతని వర్క్‌లోడ్ అంత ఎక్కువగా ఉందా? 2024 నుండి ఇప్పటివరకు చూస్తే, టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక ఓవర్లు వేసింది బుమ్రానే. అతను ఇప్పటివరకు టెస్ట్ క్రికెట్‌లో 496.4 ఓవర్లు వేశాడు. అంటే, 2980 బంతులు. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ప్రస్తుత టెస్ట్ సిరీస్ గురించి మాట్లాడితే.. జస్‌ప్రీత్ బుమ్రా ఒక మ్యాచ్ ఆడకపోయినా, ఈ సిరీస్‌లో 119.4 ఓవర్లు అంటే 718 బంతులు వేశాడు. భారత బౌలర్లలో మొహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజాల తర్వాత అత్యధిక ఓవర్లు వేసిన బౌలర్ రవీంద్ర జడేజా కాదు, బుమ్రానే (మూడో స్థానంలో).

## భారత 88వ గ్రాండ్‌మాస్టర్‌గా దివ్య.. ప్రశంసించిన చెస్ దిగ్గజం



భారత చెస్ సంచలనం దివ్య దేశ్‌ముఖ్ రికార్డు సృష్టించింది. రెండు రోజులుగా ఉత్కంఠ రేపుతున్న ఫిడే మహిళల వరల్డ్ కప్ లో ఛాంపియన్‌గా అవతరించింది. రెండుసార్లు వరల్డ్ విన్నర్ కోనేరు హంపిని ఓడించి విజేతగా నిలిచిందీ యవకెరటం. భారత 88వ గ్రాండ్‌మాస్టర్‌గా హోదాను సొంతం చేసుకుంది దివ్య. అంతేకాదు వచ్చే ఏడాది టోర్నీకి అర్హత కూడా సాధించింది.జార్జియా వేదికగా జరిగిన ఫిడే మహిళల వరల్డ్ కప్ ఫైనల్లో హంపి, దివ్య హోరాహోరీగా తలపడ్డారు. తనకంటే సీనియర్ అయిన తెలుగు తేజానికి 19 ఏళ్ల దివ్య గట్టి పోటీనిచ్చింది. ఈ మెగా టోర్నీ ఫైనల్లో తొలి రెండు మ్యాచ్‌లను డ్రాగా ముగించారిద్దరూ. దాంతో, టై బ్రేకర్ అనివార్యమైంది. ఈ రౌండ్‌లో వ్యూహాత్మక ఆటతో హంపిని మట్టికరిపించి టైటిల్ ఎగరేసుకుపోయింది దివ్య. ట్రోఫీతో పాటు రూ.43 లక్షల నగదు బహుమతి గెలుచుకుంది మహారాష్ట్ర ప్లేయర్. రన్నరప్ హంపి రూ.26 లక్షలు అందుకుంది.'భారత చెస్‌లో ఇది చరిత్రాత్మకమైన రోజు. మన దేశం నుంచి మరొక గ్రాండ్‌మాస్టర్ పుట్టుకొచ్చింది. ఫిడే మహిళల వరల్డ్ కప్‌లో విజయం దివ్య ఆత్మవిశ్వాసాన్ని రెండింతలు చేయనుంది. ఈ అద్భుత క్షణాలను ఆమెకు జీవితాంతం గుర్తుంటాయి. ఈ విక్టరీ దివ్యను భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించేందుకు దోహదపడుతుంది' అని ఐదుసార్లు ఛాంపియన్ ఆనంద్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

# స్పోర్ట్స్

## ఇంగ్లండ్ స్క్వాడ్‌లో కొత్త పేస్ అస్త్రం.. బెంచ్ మీద ఉండేది వీళ్లేనా..?




మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రఫోర్డు మైదానంలో భారత మిడిలార్డర్ అసమాన పోరాటంతో సిరీస్ పట్టేసే అవకాశం చేజార్చుకుంది స్టోక్స్ బృందం. ఊహించని డ్రాతో షాక్‌కు గురైన ఇంగ్లండ్ వ్యూహం మార్చాలనుకుంటోంది. అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో ఆఖరిదైన ఐదో టెస్టు కోసం ఆతిథ్య జట్టు ఆరో పేసర్‌ను తీసుకుంది. బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా ఉపయోగపడే జేమీ ఓవర్టన్ (Jamie Overton)ను స్క్వాడ్‌లోకి చేర్చుకుంది.ఇప్పటికే ఇంగ్లండ్ పేస్ దళంలోని అట్కిన్సన్, జోష టంగ్ బెంచ్ మీద ఉండగా.. ఓవల్ మ్యాచ్‌లో ఎవరిని పక్కన పెడతారనేది తెలియాల్సి ఉంది. బ్యాటుతో కీలక రన్స్ చేసే కార్సేను తప్పించే సాహసం ఇంగ్లండ్ చేయకపోవచ్చు. మూడేళ్ల తర్వాత పునరాగమనం చేసిన ఆర్చర్, మోకాలి గాయం నుంచికోలుకుని అద్భుతంగా రాణిస్తున్న వోక్స్ తుది జట్టులో ఉండే అవకాశముంది. బౌలింగ్ పిచ్ అయితే.. నలుగురు పేసర్లతో ఆడితే ఓవర్టన్‌కు అవకాశం దక్కే వీలుంది. ఎందుకంటే స్టోక్స్ ఐదో రోజు ఇబ్బంది పడుతూనే బౌలింగ్ చేశాడు. కాబట్టి ఓవల్‌లో ఓవర్టన్ తుది జట్టులో ఉండడం ఖాయమనిపిస్తోంది.

ఇంగ్లండ్ స్క్వాడ్ : జాక్ క్రాలే, బెన్ డకెట్, ఓలీ పోప్, జో రూట్, బెన్ స్టోక్స్(కెప్టెన్), హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్(వికెట్ కీపర్), జోష్ టంగ్ క్రిస్ వోక్స్, జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, జాకబ్ బెథెల్, బ్రైడన్ కార్సే, లియామ్ డాసన్, జేమీ ఓవర్టన్.

**ఆ నలుగురు.. ఐదు సెషన్లు**

తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియాను 358కే ఆలౌట్ చేసిన ఇంగ్లండ్.. అనంతరం 311 పరుగుల ఆధిక్యం సాధించింది. ఇక మ్యాచ్ మనదే అని ఉత్సాహంతో గిల్ సేనను ఆలౌట్ చేయాలనుకున్న ఇంగ్లండ్ బౌలర్ల ఎత్తులు ఫలించలేదు. నలుగురంటే నలుగురే ఐదు సెషన్లు క్రీజులో నిలిచి స్టోక్స్ సేనుకు ముచ్చెమటలు పట్టించి చిరస్మరణీయ డ్రాతో జట్టును గట్టెక్కించారు.